


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 257, పేజీలు - 08
మంగళవారం, మార్చి 3, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి
# ముఖ్యమంత్రిని అయ్యాను

**- రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తామన్న సీఎం రేవంత్**

- రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యల పైనే గళమెత్తానన్న ముఖ్యమంత్రి
- తన మీద కేసులు పెట్టారని, కోర్టుకు వెళ్లారని గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి
- రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యమని వ్యాఖ్య

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వికారాబాద్ జిల్లా అనంతగిరిలో కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఈ సమావేశాల ముగింపు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ భవిష్యత్ కోసం దేశ ప్రజల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. దేశం కోసం అందరి కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. గత 5 ఏళ్లుగా రాహుల్ గాంధీ చేసిన నిరంతర పోరాటాల ఫలితంగానే ఇప్పుడు ఆయన లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎదిగారని గుర్తు చేశారు. దేశంలో నెలకొన్న అనేక సమస్యలపై రాహుల్ గాంధీ నిత్యం అలుపెరగని పోరాటం చేస్తున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల తదుపరి లక్ష్యం కావాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే తన రాజకీయ ప్రస్థానానికి సంబంధించి

2లో..



## భారత్ కెనడా మధ్య యురేనియం ఒప్పందం

**- భారత్- కెనడా మధ్య 2.6 బిలియన్ డాలర్ల డీల్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య 2.6 బిలియన్ డాలర్ల యురేనియం సరఫరా ఒప్పందం కుదిరింది. అలాగే, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(సీఈపీఏ)పై చర్చలను వేగవంతం చేయాలని ఇరు దేశాల

2లో..

# ప్రజల్లో 90 శాతం సంతృప్తి ఉండాల్సిందే

- దీపం పథకం గ్యాస్ డెలివరీకి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో టాయిలెట్స్ మరమ్మతులకు ఆదేశం
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతికి తావులేని అధికారులకే బాధ్యతలు



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, వివిధ శాఖల పనితీరుపై ప్రజల్లో సానుకూల దృక్పథం (పాజిటివ్ పర్సెప్షన్) పెరిగేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్, పబ్లిక్ పర్సెప్షన్‌పై సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ నెల నుంచి ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి స్థాయి కనీసం 80 నుంచి 90 శాతానికి తగ్గకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో అలసత్వం వహించకూడదని సీఎం హెచ్చరించారు. ముఖ్యంగా పెన్షన్ల పంపిణీలో ఇంకా లోటుపాట్లు ఉన్న 'స్వర్ణ' గ్రామాలు, వార్డులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అట్టడుగు స్థానంలో ఉన్న ప్రాంతాల్లో కూడా పంపిణీ సమర్థంగా జరగాలన్నారు. అలాగే, దీపం పథకం కింద అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల డెలివరీకి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజారవాణాపై సమీక్షిస్తూ ఆర్టీసీ బస్సు సర్వీసులు బాగానే ఉన్నప్పటికీ, బస్టాండ్లలో

2లో..

## అన్ని వైపులా నావైపే

**- ఈసారి అంచనాలు తప్పే ఛాన్స్ లేదట**



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధినేత జగన్ కు ఈసారి ఎన్నికలు చావో రేవో అని చెప్పక తప్పదు. కూటమి కలసి ఉన్నంత వరకూ తాను గెలవడం కష్టమేనని జగన్ కు తెలియంది కాదు. అలాగని జగన్ కు అధికారం తనదేనన్న ధీమా కూడా అంతే స్థాయిలో ఉంది. అధికార పార్టీలపై సహజంగా ఏర్పడే వ్యతిరేకత తనకు అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. తన పార్టీకి సొంత బలం నలభై శాతం ఓటు బ్యాంకు ఉంది. దానికి తోడు

2లో..

## అన్నారం బ్యారేజీపై
# రేవంత్ ప్రభుత్వం కుట్రలు

**- కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసే పన్నాగం.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మేడిగడ్డ బ్యారేజీ విషయంలో జరిగిన వివాదాలు చాలదన్నట్టు, ఇప్పుడు అన్నారం బ్యారేజీని కూడా ప్రమాదంలోకి నెట్టేందుకు కుతంత్రాలు మొదలయ్యాయనే బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి, బ్యారేజీ పిల్లర్ల వద్దే భారీ ఎక్స్‌వేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బ్యారేజీకి అత్యంత సమీపంలో ఇలాంటి తవ్వకాలు చేపట్టకూడదనే కనీస నిబంధనలను కూడా పాటించకుండా, ఇసుక మాఫియా సాగిస్తున్న ఈ అరాచకంపై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**- రాజకీయ కుట్రలు చేస్తోందని అధికార పార్టీపై విమర్శలు**



అన్నారం బ్యారేజీని బలహీనపరిచి, ఆ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం

2లో..

## గల్ఫ్ దేశాల అధినేతలకు
# మోదీ ఫోన్

**- ఇరాన్ దాడిని ఖండించిన ప్రధాని**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)యుద్ధ వాతావరణం మరింత ముదురుతున్న వేళ గల్ఫ్ దేశాధినేతలకు ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్ చేశారు. ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల భద్రతపై చర్చించారు. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాల నేతలకు కీలక సూచనలు చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు అత్యంత ఆందోళనకరమని పేర్కొన్న మోడీ, భారత్ ఎప్పుడూ శాంతినే కాంక్షిస్తుందని స్పష్టం చేశారు. "ఎటువంటి వివాదాలనైనా దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ గట్టిగా విశ్వసిస్తుంది" అని ఆయన పునరుద్ఘాటించారు. ఈ క్లిష్ట సమయంలో అన్ని పక్షాలు సంయమనం పాటించాలని ఆయన కోరారు. యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రాంతాల్లో ఉన్న వేలాది మంది భారతీయ పౌరుల భద్రత గురించి ప్రధాని ప్రస్తావించారు. వారి క్షేమాన్ని పర్యవేక్షించేందుకు మరియు రక్షణ కల్పించేందుకు ఆయా దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, భారతీయుల భద్రత తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న ఉగ్రవాదం కేవలం భారత్, కెనడాలకే కాకుండా మొత్తం మానవాళికే పెను సవాలుగా మారిందని ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు. వీటిని అణచివేసేందుకు ప్రపంచ దేశాలన్నీ

2లో..

## ప్రధానమంత్రి పదవిని
# చేపట్టేందుకు సిద్ధం

**- శిక్షణా తరగతుల సమావేశంలో రాహుల్ గాంధీ**

- కాంగ్రెస్‌ను శివుడితో.. బీజేపీని విష్ణువుతో పోల్చిన రాహుల్ గాంధీ
- కాంగ్రెస్ విధానం అహింస, బీజేపీది హింసా విధానమని విమర్శ
- ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారన్న రాహుల్ గాంధీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వికారాబాద్ జిల్లా అనంతగిరిలో గత 10 రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరై ప్రసంగించారు. ఈ ప్రసంగంలో భాగంగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వివాదాస్పదం అవుతున్నాయి.



కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు

2లో..

# హోలీ పండుగ వేళ వైన్స్ బంద్

**- మందుబాబులకు షాకిచ్చిన సజ్జనార్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హోలీ పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. నేడు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్ నగర పరిధిలో వైన్స్, కల్లు కాంపౌండ్లు, బార్లు, క్లబ్‌లు మూసివేయాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే

2లో..

# హైడ్రా పేదల ఇళ్ళను కూల్చుతోంది

- పెద్దల ఇళ్లు హైడ్రాకు కనిపించడం లేదని ఆరోపణ
- బాన్సువాడలో హిందూ యువకులను అరెస్టు చేశారన్న బండి
- హిందువులు ఇప్పటికైనా ఉద్యమించాలని పిలుపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో హైడ్రా పేదల ఇళ్ళను కూల్చుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రధాని ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇళ్లను నిర్మిస్తే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కూల్చివేత ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. హైడ్రాకు పెద్దవాళ్ల ఇళ్లు కనిపించడం లేదని ఆరోపించారు. కేవలం పేదల ఇళ్లు మాత్రమే కూల్చుతున్నారని అన్నారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ, బఫర్ జోన్‌లో, ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఎన్ని ఇళ్లను కూల్చివేశారో లెక్కలు తీయడానికి సిద్ధమా అని సవాల్ చేశారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలో భూదాన్ పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సమాజం జాగృతం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. హిందువులు రోడ్ల మీదకు వచ్చి కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల మెడలు వంచాల్సిందేనని అన్నారు. ఇంకా ఎన్ని రోజులు ఇలాంటి దాడులను భరిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం బొట్టు పెట్టుకుని దేవుడిని మొక్కడంతో సరిపోదని అన్నారు. దేవాలయాలపై దాడులు జరిగినప్పుడు స్పందించని వాడు హిందువే కాదని బండి సంజయ్ అన్నారు. ముత్యాలమ్మ గుడి మీద దాడి చేసినా, మరే గుడిపై దాడి చేసినా స్పందించేది బజరంగ్ దళ్, హిందూవాహిని, హిందూ సంస్థలు, బీజేపీ మాత్రమే అన్నారు. కానీ సామాన్య హిందూ సమాజం ఇలాంటి దాడులను ఖండించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాన్సువాడలో అమాయకులైన హిందూ యువకులను అరెస్టు చేసి జైల్లో పెడితే వారి కుటుంబాలు కన్నీళ్లు పెడుతున్నాయని అన్నారు.

2లో..

## మరిన్ని భీకర దాడులు చేస్తాం

**- ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దు**



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) మరిన్ని భీకర దాడులు చేస్తామని, ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, ప్రతిదాడులు మూడో రోజు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ, తమ జోలికి ఎవరు వచ్చినా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. త్వరలో మరిన్ని తీవ్ర దాడులు ఉంటాయని తెలిపారు. ప్రజలంతా సురక్షితంగా ఉండాలని, వారు ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని సూచించారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యాన్ని అమెరికా కలిగి ఉందని, దానిని ఇప్పుడు ఉపయోగిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ సాఫీగా, తమకు ఎలాంటి ఇబ్బందిలేకుండా సాగుతోందని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. ఇరాన్ ప్రజలు నియంత పాలన నుంచి స్వేచ్ఛ పొందడానికి అమెరికా ఈ సైనిక చర్యకు ఉపక్రమించిందని అన్నారు. ఇరాన్ ఇలాగే దాడులు కొనసాగిస్తే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

2లో..

# 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రిని అయ్యాను

రేవంత్ రెడ్డి కీలక విషయాలను వెల్లడించారు.ఒక సామాన్య జడ్పీటీసీ స్థాయి నుంచి తాను ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యానని తన రాజకీయ ప్రయాణాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. గత 19 ఏళ్ల కాలంలోనే జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా, పార్టీలో రకరకాల పదవులు, బాధ్యతలను స్వీకరించి చాలా అనుభవాన్ని సంపాదించినట్లు వెల్లడించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ పైరవీలకు తావు లేదని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి కేవలం ప్రజల సమస్యల పైనే గళం వినిపించడమే తన ప్రధాన పనిగా పెట్టుకుని ఈ స్థాయికి వచ్చినట్లు వివరించారు.ప్రజల కోసం పోరాటం చేసి వారి పక్షాన నిలబడినందుకు తనపై ఎన్నో కేసులు నమోదు చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కేసులు మాత్రమే కాకుండా.. పరువు నష్టం దావాలు కూడా వేశారని తెలిపారు. నిన్న కూడా తాను ఓ కేసులో కోర్టుకు హాజరైనట్లు తెలిపిన రేవంత్ రెడ్డి.. అయినప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు సోనియా గాంధీపై ఉన్న ప్రజలకు ఉన్న నమ్మకమే ప్రధాన కారణమని ఈ సందర్భంగా వెల్లడించారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం కైవసం చేసుకున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కృషి చేయాలని హస్తం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయడమే మన మార్గమని రాహుల్ గాంధీని పీఎం చేయడమే మన గమ్యమని వ్యాఖ్యానించారు.

**- తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ**

తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించింది ఇచ్చింది కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీయే అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ అనేక సమస్యలపై పోరాటం చేశారని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్,కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ కెనడా మధ్య యురేనియం ఒప్పందం

నేతలు అంగీకరించారు. భారత పౌర అణుశక్తి కార్యక్రమానికి దీర్ఘకాలిక ఇంధన సరఫరాను నిర్ధారించే లక్ష్యంతో ఈ యురేనియం ఒప్పందాన్ని రూపొందించారు, ఇది భారత ఇంధన భద్రతకు అత్యంత కీలకమైన అడుగుగా భావిస్తున్నారు.సీఈపీఏ వాణిజ్య ఒప్పందాన్ని 2026 చివరి నాటికి పూర్తి చేయాలని ఉభయ పక్షాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని కార్నీ తెలియజేశారు. ఇది ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చల అనంతరం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, "సుదీర్ఘ కాల యురేనియం సరఫరాకు సంబంధించిన ఒక చారిత్రాత్మక ఒప్పందాన్ని మేము చేసుకున్నాం. చిన్న మాడ్యులర్ రియాక్టర్లు, ఆధునిక రియాక్టర్లపై కూడా కలిసి పని చేస్తాం" అని స్పష్టం చేశారు.రెండు దేశాలు కీలక ఖనిజాల సహకారం, పునరుత్పాదక ఇంధన ప్రోత్సాహం, సాంస్కృతిక మార్పిడితో సహా పలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసుకున్నాయి. విదేశాంగ మంత్రులు ఎస్. జైశంకర్, కెనడా అనితా ఆనంద్ ఇరు ప్రధానుల సమక్షంలో ఈ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం కోసం నిబంధనల విధివిధానాలపై భారత్, కెనడా అంగీకరించాయి. ఖనిజాల రంగంలో సహకారాన్ని బలోపేతం చేయడానికి కూడా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఉత్సాహాన్ని నింపినందుకు ప్రధాని కార్నీని మోదీ అభినందించారు. "భారత్, కెనడా ప్రజాస్వామ్య విలువలను దృఢంగా విశ్వసిస్తాయి. మేము వైవిధ్యాన్ని గౌరవిస్తాం. మానవజాతి శ్రేయస్సు మా ఉమ్మడి దార్శనికత. ఈ దార్శనికతను తరువాతి స్థాయి భాగస్వామ్యంగా మార్చేందుకు ఈరోజు చర్చించాం" అని మోదీ పేర్కొన్నారు. ఆర్థిక సహకారంలో ఒక ఆశావహ లక్ష్యాన్ని నిర్దేశిస్తూ.. 2030 నాటికి $50 బిలియన్ల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని చేరుకోవాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని మోదీ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, "ఆర్థిక సహకారం యొక్క పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయడం మా ప్రాధాన్యత. అందుకే సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని త్వరలో ఖరారు చేయాలని నిర్ణయించాం. ఇది ఇరు దేశాల్లో కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది" అని వివరించారు. కార్నీ యురేనియం ఒప్పందాన్ని ఒక గొప్ప ముందడుగుగా అభివర్ణించారు. 2026 నాటికి సీఈపీఏ చర్చలను ముగించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కెనడా ప్రధాని మరోసారి నొక్కిచెప్పారు. ఇరు దేశాల అధినేతలు పునరుత్పాదక శక్తి, వాతావరణ కార్యక్రమాలలో సహకారాన్ని విస్తరించారు. అంతర్జాతీయ సౌర కూటమి, గ్లోబల్ బయోఫ్యూయల్ అలయన్స్‌లో చేరాలన్న కెనడా నిర్ణయాన్ని మోదీ స్వాగతించారు. ఈ ఏడాది ఇండియా-కెనడా పునరుత్పాదక శక్తి, స్టోరేజ్ సదస్సు జరుగుతుందని ఆయన ప్రకటించారు. సాంకేతికత, ఆవిష్కరణల విషయంలో ఇరు దేశాలు "సహజ భాగస్వాములు" అని మోదీ పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), క్వాంటం టెక్నాలజీలు, సూపర్ కంప్యూటింగ్, సెమీకండక్టర్లలో సహకారం గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల-ప్రజల మధ్య సంబంధాలు, విద్యా భాగస్వామ్యాలు కూడా చర్చల్లో కీలక స్థానం పొందాయి. ఏఐ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఆవిష్కరణలలో కొత్త విశ్వవిద్యాలయ సహకారాలను మోదీ ప్రకటించారు. కెనడియన్ విశ్వవిద్యాలయాలు భారత్ లో క్యాంపస్ లను తెరవడానికి ఇరు పక్షాలు అంగీకరించాయి.స్థానిక, గిరిజన వర్గాల మధ్య పరస్పర సంబంధాలతో సహా సాంస్కృతిక మార్పిడిని పెంపొందించడానికి కూడా ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఇది ఇరు దేశాల ప్రజల మధ్య మరింత సన్నిహిత సంబంధాలను ప్రోత్సహిస్తుంది. మోదీ ఆహ్వానం మేరకు ఫిబ్రవరి 27న భారతదేశానికి చేరుకున్న కార్నీ ఇది ఆయనకు మొదటి అధికారిక పర్యటన. ముంబైలో తన పర్యటనను ప్రారంభించిన ఆయన, ప్రతినిధి స్థాయి చర్చల కోసం దిల్లీ చేరుకున్నారు. తమ కార్యక్రమాలను ముగించుకుని సోమవారం సాయంత్రం బయలుదేరనున్నారు. భారత-కెనడా వ్యూహాత్మక భాగస్వామ్యం కింద వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, వ్యవసాయం, విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, ప్రజల మధ్య సంబంధాలు సహా పలు కీలక రంగాలలో సాధించిన ప్రగతిని ద్వైపాక్షిక చర్చలు సమీక్షించాయి. ఈ సందర్భంగా ఇరు అధినేతలు ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నారు. అధికారిక చర్చలతో పాటు, మోడీ, కార్నీ ఇండియా-కెనడా సీఈఓ ల ఫోరమ్ కు హాజరయ్యారు. ఇది వ్యాపారం, పెట్టుబడుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచే ప్రయత్నాలను నొక్కి చెప్పింది.

# ప్రజల్లో 90 శాతం సంతృప్తి ఉండాల్సిందే

మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పుంగనూరు, వెంకటగిరి, పెనుకొండ, ప్రొద్దుటూరు, ఎమ్మిగనూరు, శ్రీకాళహస్తి బస్టాండ్లలో తాగునీరు, టాయిలెట్స్, ఫ్యాన్స్, సీటింగ్ ఏర్పాట్లపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించారు. ప్రయాణికుడు బస్టాండ్‌కు వచ్చిన దగ్గరి నుంచి గమ్యస్థానం చేరేవరకూ ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలని, రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో టాయిలెట్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరుస ప్రమాదాల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలో తెలుసుకునేందుకు తమిళనాడులోని శివకాశీకి వెళ్లి అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.రిజిస్ట్రేషన్ శాఖ పనితీరుపై చర్చిస్తూ స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలపై ప్రజల్లో సంతృప్తి ఉందని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, అవినీతికి ఆస్కారం లేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయతీ కలిగిన అధికారులకే బాధ్యతలు ఇవ్వాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి 'వాట్సాప్ మనమిత్ర' సేవలను నూటికి నూరు శాతం వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అన్ని శాఖల పనితీరు మెరుగుపరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# హైడ్రా పేదల ఇళ్ళను కూల్చుతోంది

చాంద్రాయణగుట్టలో చారిత్రాత్మక హనుమాన్ దేవాలయంపై దాడి జరిగితే కూడా హిందువులు బయటకు రావడం లేదని అన్నారు. ఇదేం పద్ధతి... హిందూ సమాజం ఇలాంటి దాడులను ఇంకా ఎన్నాళ్లు భరిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో అనేక దేవాలయాలపై దాడులు జరిగాయని అన్నారు. తాను ఇతర ప్రార్థనాలయాల గురించి మాట్లాడటం లేదని, కానీ హిందువుగా తమ దేవాలయంపై దాడి జరుగుతుంటే ప్రశ్నిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని హిందూ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారి అర్థం చేసుకోవాలని, దేవాలయాలపై దాడులు జరుగుతుంటే స్పందించాలని బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం అన్ని పార్టీల జెండాలు పక్కన పెట్టి కేవలం కాషాయ జెండాను పట్టుకుని కొట్లాడుదామని పిలుపునిచ్చారు. బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని అన్నారు.

# మరిన్ని భీకర దాడులు చేస్తాం

ఇరాన్‌పై అసలైన దాడిని ఇంకా ప్రారంభించలేదని, ఆ దేశం ఇలాగే వ్యవహరిస్తే దాడి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఆయన సీఎన్ఎన్ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

# అన్ని వైపులా నావైపే

అధికార పార్టీ పై వ్యతిరేకత తోడయితే విజయం ఖాయమన్నలెక్కల్లో ఉన్నారు. తన ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజలు బేరీజు వేసుకుంటారు.అదే తన గెలుపునకు ప్రధాన కారణమని వైఎస్ జగన్ తన సన్నిహితుల వద్ద కూడా విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**- పాదయాత్రతో పాటు..**

అధికార పార్టీపై వ్యతిరేకతతో పాటు తాను ఏడాదిన్నర తర్వాత చేపట్టబోయే పాదయాత్ర కూడా పార్టీకి మంచి మైలేజీ తెచ్చిపెడుతుందని జగన్ విశ్వసిస్తున్నారు. పాదయాత్రతో కొన్ని వర్గాలను ఫ్యాన్ పార్టీ వైపునకు తిప్పుకోగలనన్న ధీమాలో ఉన్నారు. ప్రస్తుత అధికార పార్టీ ఎమ్మెల్యేల పై ఉన్నవ్యతిరేకత తన విజయానికి సానుకూలత తెచ్చిపెడుతుందని ఆశిస్తున్నారు. కూటమిలోని పార్టీ నేతలే ఎమ్మెల్యేలు, అధికారుల అవినీతిపై చేస్తున్న బహిరంగ విమర్శలు తన గెలుపునకు ప్రధాన కారణం కానున్నాయని కూడా జగన్ అంచనా వేసుకుంటున్నారు. దీనికి తోడు పేద,మధ్య తరగతి ప్రజలు కూడా గత ఎన్నికల్లో దూరమైన వారు తిరిగి తనవైపునకు వస్తారని బలంగానమ్ముతున్నారు.

**- కేంద్రంలో నాయకత్వంతోనూ..**

ఇక జగన్ మరొక ధీమా. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ. కూటమిలో మిత్ర పక్షంగా ఉన్నప్పటికీ బీజేపీ తనకు మేలు చేయకపోయినా, నష్టం చేయదన్న అంచనాలో జగన్ ఉన్నారని తెలిసింది. అందుకే బేషరతుగా బీజేపీకి జగన్ మద్దతు అన్ని విషయాల్లో ఇస్తూ వస్తున్నారు. అదీ ఇదీ కాదు కేంద్రం ఏదంటే అటే జగన్ మొగ్గు చూపుతున్నారు. అంతే కాకుండా ఇప్పటికీ కేంద్ర నాయకత్వంలో తన పట్ల సానుకూలత, సానుభూతిగా ఉన్నారని జగన్ భావిస్తున్నారు. కాంగ్రెస్ ను వ్యతిరేకించే తనను బీజేపీ దూరం చేసుకోగలదని కూడా జగన్ భావన.అందుకే ఎటు చూసినా తన గెలుపునకు అన్ని కారణాలు, అన్నిఅంశాలు దోహదపడతాయనుకుంటున్నారు. అందుకే తరచూ జగన్ వచ్చేఎన్నికల్లో గెలుపు మనదేనంటూ పదే పదే ప్రకటిస్తున్నారనిపిస్తుంది.

# అన్నారం బ్యారేజీపై రేవంత్ ప్రభుత్వం కుట్రలు

పన్నాగం పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ అరాచక పర్వాన్ని సాగిస్తోందని, దీన్ని రైతాంగం ఎన్నటికీ క్షమించదన్నారు. ప్రజలు సైతం ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. పట్టపగలే నిస్సిగ్గుగా కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లోనే ఇసుక మాఫియా ఈ దందా సాగిస్తోందని, ఇది తెలంగాణ వనరులను నిలువునా కొల్లగొట్టడమేనని మండిపడ్డారు.

**- ప్రజా పాలనపై విరుచుకుపడుతున్న విపక్షాలు**

ప్రస్తుత రేవంత్ సర్కార్ హయాంలో "అందినకాడికి దోచుకో దొరికినకాడికి అమ్ముకో" అనే సూత్రమే ప్రాతిపదికగా సాగుతోందని కేటీఆర్ విమర్శించారు. అన్నారం బ్యారేజీకి లేదా కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏమైనా నష్టం జరిగితే దానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీయే వహించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సంపదను దోచుకుంటున్న నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగి ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు అయితే, త్వరలోనే ప్రజలు ఎన్నికల క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని కేటీఆర్ పేర్కొన్నారు.

# గల్ఫ్ దేశాల అధినేతలకు మోదీ ఫోన్

ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు.

**- శాంతియుత పరిష్కారాలే ఉత్తమం**

సోమవారం ఉదయం న్యూదిల్లీలో కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీతో కలిసి భారత ప్రధాని మోదీ సంయుక్త మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులోనూ మోదీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ప్రపంచంలో జరుగుతున్న సైనిక సంఘర్షణల విషయంలో భారత్‌కు ఒక స్పష్టమైన వైఖరి ఉందని ఆయన తెలిపారు. భారత్ ఎల్లప్పుడూ శాంతి, సుస్థిరతలకే ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఘర్షణలకు దిగడం కంటే శాంతియుత పరిష్కారాలను వెతుక్కోవడమే మంచిదని మోదీ సూచించారు. అటువంటి ప్రయత్నాలకు సదా భారత్ మద్దతు లభిస్తుందన్నారు. పశ్చిమాసియా ప్రాంతంలోని భారతీయుల భద్రత కోసం అక్కడి దేశాలతో కలిసి పనిచేస్తున్నామని ప్రధాని వెల్లడించారు. భారత్, కెనడా లాంటి ప్రజాస్వామ్య దేశాలు జట్టు కడితే, ప్రపంచ శాంతి గళం మరింత బలాన్ని పొందుతుందన్నారు.

# ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు సిద్ధం

రాహుల్ గాంధీ చెప్పిన కొత్త అర్థాలు తీవ్ర దుమారానికి కారణం అయ్యాయి. కాంగ్రెస్‌ను శివుడితో బీజేపీని విష్ణువుతో పోల్చిన రాహుల్ గాంధీ దానికి సంబంధించి క్లారిటీ కూడా ఇచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడుతోంది. కాంగ్రెస్ పార్టీని శివుడిగా అభివర్ణించిన రాహుల్ గాంధీ హస్తం పార్టీ విధానం అహింస, ప్రజలకు సేవ చేయడం, పార్టీ నమ్ముకున్న సిద్ధాంతాల పైనే దృష్టి పెడుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో బీజేపీని విష్ణుమూర్తితో పోల్చిన రాహుల్ గాంధీ కమలం పార్టీ విధానం మాత్రం హింస, అధికారం కోసం ప్రజలను మోసం చేయడం అని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీకి శివుడి పోలిక ఉందన్న రాహుల్ మహా శివుడు తన శరీరంలో సగభాగాన్ని మహిళకు ఇచ్చి నిరాడంబరంగా అడిగితే ఇచ్చే విధంగా ఉంటాడని తెలిపారు. ఇక శివుడి వద్ద త్రిశూలం ఉండి కూడా అది ఆయన వెనకే ఉంటుందని పేర్కొన్నారు. ధర్మాన్ని కాపాడాల్సి వచ్చిన సమయంలో మాత్రమే ఆ త్రిశూలాన్ని ఉపయోగిస్తారని రాహుల్ గాంధీ చెప్పారు. ఇక బీజేపీకి విష్ణువుతో పోలిక ఉందని పేర్కొంటూ ఆ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విష్ణువు లాగా బీజేపీ పార్టీ ఆడంబరంగా కేవలం అధికారంపై మాత్రమే దృష్టి పెట్టే విధానాన్ని అనుసరిస్తుందని విమర్శలు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ గాంధీ కీలక సూచనలు చేశారు. హస్తం పార్టీ నేతలకు నిజాయితీగా, నిరాడంబరంగా, దృఢత్వంతో ఉండాలని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు అంటే తమ టీమ్ అని భవిష్యత్ పార్టీ కోసం కలిసి పనిచేయాలని హితవు పలికారు. శివుడు, విష్ణువు అంటూ రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యల ద్వారా కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఉన్న రాజకీయ విధానాల మధ్య తేడాలను అర్థమయ్యేలా అందరికీ వివరించారు. అదే సమయంలో నాయకత్వ ధోరణులపై సరికొత్త అర్థాన్ని ప్రస్తావించారు.

# హోలీ పండుగ వేళ వైన్స్ బంద్

సిటీ పోలీస్ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఎక్కడైనా, ఎవరైనా సమస్యలు సృష్టిస్తే తక్షణమే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ నగరవాసులు పోలీసులకు సహకరించి హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సజ్జనార్ సూచించారు. నగర పరిధిలో హోలీ పండగ వేళ లా అండ్ ఆర్డర్‌కు భంగం కలగకుండా స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలని వైన్ షాప్ యజమానులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. మద్యం తాగి బహిరంగ ప్రదేశాల్లో ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. హోలీ సందర్భంగా ప్రతి సంవత్సరం హైదరాబాద్ నగరంలో వైన్ షాపులు తెరిచేందుకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు.మరోవైపు తెలియని వ్యక్తులపై కలర్ చల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని కూడా సీపీ సజ్జనార్ హెచ్చరించారు. హోలీ పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. రోడ్లపై రంగులు చల్లుతూ వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దని అలా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బైక్‌లు, కార్లు, ఇతర వాహనాలతో గుంపులు గుంపులుగా తిరగొద్దని పేర్కొన్నారు. రసాయన రంగులకు బదులు సహజ రంగులు వాడి హోలీ పండగను సహజ సిద్ధంగా జరుపుకోవాలని హితవు పలికారు. హోలీ పండగ సందర్భంగా డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్‌తో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని సీపీ సజ్జనార్ తెలిపారు.

**- మార్చి 3వ తేదీనే హోలీ పండగ**

ఈసారి హోలీ పండగ తేదీ విషయంలో తీవ్ర గందరగోళం తలెత్తింది. మొదట తెలంగాణ పాఠశాల విద్యా శాఖ తన అకడమిక్ క్యాలెండర్‌లో హోలీ పండగ సెలవు మార్చి 4వ తేదీ అని పేర్కొంది. కానీ ప్రస్తుతం హోలీ పండగను 3వ తేదీనే జరుపుకోవాలని పండితులు సూచిస్తున్నారు. దీంతో ప్రభుత్వం కూడా హోలీ పండగను 3వ తేదీకి మార్చింది. ప్రభుత్వ నిర్ణయంతో హోలీ సెలవును మార్చి 4వ తేదీ కాకుండా మార్చి 3వ తేదీనే అని తాజాగా తెలంగాణ పాఠశాల విద్యా శాఖ సర్క్యులర్ జారీ చేసింది.

# రాజధాని ప్రాంతంలో మంత్రి నారాయణ పర్యటన



**అమరావతి** నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారులు టైప్ -1,టైప్ -2,గ్రూప్ - డి ఉద్యోగుల క్వార్టర్లను మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు.మంత్రి మాట్లాడుతూ వైసీపీ నా మీద కూడా కేసులు పెట్టింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ లో 2001 లో కొన్న 60 సెంట్ల నా సొంత స్థలం కూడా పోయింది. విజయవాడ సమీపంలో ఈడుపుగల్లు లో ఉన్న నా స్థలం గుండా ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్తుంది. మా వాళ్ళు బిల్డింగ్ నిర్మాణం కోసం వెళ్తే సీఆర్డీయే వాళ్ళు మీ స్థలం లేదని చెప్పారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమాలు జరిగాయని ప్రచారం చేశారు. ప్రస్తుతం కోర్టులో కేసు ఉంది కాబట్టి...ఎలాంటి కామెంట్స్ చేయనని అన్నారు. అమరావతిలో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మొత్తం 4026 ఇళ్లకు అంతర్గత పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో పనులు నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చాయి. వర్షాల వల్ల గత నవంబర్ వరకు పనులు జరుగలేదు . అమరావతిలో ప్రైవేట్ సంస్థలు నిర్మాణ పనులు కూడా చాలా వరకూ జరుగుతున్నాయి. టార్గెట్ ప్రకారం పనులు చేయకపోవడంపై షాపూర్జీ - పల్లోంజి మేనేజ్మెంట్ తో మాట్లాడుతున్నానని వెల్లడించారు.

# రష్మికతో స్వగ్రామానికి విజయ్ దేవరకొండ

**నాగర్ కర్నూలు** నటుడు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు నాగర్ కర్నూల్- బలమూరు మండలం తుమ్మన్పేట చేరుకున్నారు. నూతన ఫామ్ హౌస్లో గృహప్రవేశం, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ నేధ్యంలో అభిమానులు, కుటుం సభ్యులు, బందువులు భారీగా తరలివచ్చారు. తుమ్మన్ పేటలో సందడి నెలకొంది.

# ప్రొద్దుటూరులో 10 తరగతి విద్యార్థి ఆత్మహత్య



**కడప** ప్రొద్దుటూరు మోడంపల్లిలోని ప్రభుత్వ వసతి గృహంలో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వసతిగృహంలోని చెట్టుకు ఉరేసుకుని విద్యార్థి నరసింహులు ఆత్మహత్య చేసుకున్నాడు. వసతిగృహం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో మృతుడు పదో తరగతి చదువుతున్నాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలపై ఆరాతీస్తున్నారు. విద్యార్థి నరసింహులు స్వగ్రామం మైలవరం మండలం కల్లుట్ల గ్రామం.

# పసుపు రంగు రాసిన చికెన్ విక్రయిస్తే చర్యలు




**హన్మకొండ** చికెన్ సెంటర్లలో కోడి మాంసాన్ని శుభ్రం చేసేటప్పుడు పసుపుకు బదులుగా కృత్రిమ రంగులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ ఫుడ్ ఇన్స్పెక్టర్ బ్రహ్మాజీ హెచ్చరించారు. ఆదివారం వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్య దర్శి చక్రపాణితో కలిసి ఆయన పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన రంగులు కలిపిన మాంసం తింటే ఉదర, పేగు క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# రింగ్ రోడ్డులో ప్రమాదం..ఇద్దరికి గాయాలు



**హైదరాబాద్** ఎల్బీనగర్ సాగర్ రింగ్ రోడ్డు వద్ద అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తూ ముందు ఉన్న డిసిఎం ను కారు ఢీకొని పల్టీ కొడుతూ డివైడర్ను ఢీకొంది. దాంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. కారులో ఉన్న డ్రైవర్ సాయి కీర్తన్ కు మంటలు అంటుకొని తీవ్ర గాయాలు కావడంతో ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్ కి తరలించారు. డీసీఎం డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. మంటల ధాటికి కారు పూర్తిగా దగ్ధమైంది. సాయి కీర్తన్ ను ఎల్బీనగర్ రాక్ టౌన్ కాలనీకి చెందినవాడుగా గుర్తించారు. అతివేగం ప్రమాదనికి కారణమని తెలుస్తుంది

## కాకతీయ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



మంథని( ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని కాకతీయ విద్యాసంస్థ లో సోమవారం ఘనంగా ఖఖ+ "గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం" నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా మంథని మండల సి.ఆర్. పి మల్లయ్య హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులకు పట్టాలు మరియు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, "పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని, మంచి పౌరులుగా ఎదగాలని" ఆకాంక్షించారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్పులో కబడ్డీ లో రాష్ట్రస్థాయికి వెళ్లి ప్రతిభ కనబరిచిన పాఠశాలలో 7 వ తరగతి చదువుతున్న అన్వేష్ ని సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, స్రవంతి రెడ్డి, పావని రెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమం ఆనందోత్సాహ వాతావరణంలో ముగిసింది.

## సంసద్ క్రీడా మహోత్సవంతో

# యువతలో ఉత్సాహం

- కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశాలతో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం
- యువతకు క్రీడలే భవిష్యత్ బాట
- భాజపా మాజీ జిల్లాధ్యక్షులు : ప్రతాప రామకృష్ణ



వేములవాడ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వేములవాడ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు వేములవాడ పట్టణంలోని 1వ వార్డు శాత్రాజుపల్లి హైస్కూల్ మైదానంలో ఈ పోటీలకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భాజపా మాజీ జిల్లాధ్యక్షులు ప్రతాప రామకృష్ణ వాలీబాల్, కోకో, కబడ్డీ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ప్రోత్సహించారు.క్రీడలు

### వ్యక్తిత్వ వికాసానికి దోహదం

ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. 2018లో ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా క్రీడా మహోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పాల్గొన్న క్రీడాకారులకు సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు కూడా దృష్టి సారించేటట్లు ప్రోత్సహించాలని కోరారు. పెద్దఎత్తున పాల్గొన్న నాయకులు, క్రీడాకారులుఈ కార్యక్రమంలో బీజేపీ వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కౌన్సిలర్లు వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు,అన్ని మండలాల క్రీడాకారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## శాంతిభద్రతల కోసం పోలీసుల కఠిన చర్యలు

- వేములవాడ పట్టణంలో నెల రోజులపాటు నిషేధాజ్ఞలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- పోలీసులకు ప్రజలు సహకరించాలి
- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో ప్రజా శాంతి, భద్రత, ప్రశాంత వాతావరణం కొనసాగించేందుకు పోలీస్ చట్టం-1861లోని రూల్ 30 ప్రకారం జారీ చేసిన నిషేధాజ్ఞలు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కఠినంగా అమలు చేయనున్నట్లు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ వెల్లడించారు.ఈ నిషేధాజ్ఞలు మార్చి 1, 2026 తేదీ 00:00 గంటల నుండి మార్చి 31, 2026 తేదీ 24:00 గంటల వరకు అమల్లో ఉంటాయని ఆయన తెలిపారు. సబ్-డివిజనల్ పోలీస్ అధికారి లేదా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అనుమతి లేకుండా ఎటువంటి ప్రజా సమావేశాలు,ర్యాలీలు, ఊరేగింపులు,ఆందోళన కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.అదేవిధంగా ఖడ్గాలు, కత్తులు, ఈటెలు, కర్రలు (జెండాలతో లేదా లేకుండా), తుపాకులు, పేలుడు పదార్థాలు తదితర ప్రమాదకర ఆయుధాలను ప్రజా ప్రదేశాల్లో తీసుకెళ్లడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ప్రజా రహదారులు, స్థలాల్లో గుంపులుగా చేరి శాంతిభద్రతలకు భంగం కలిగించడం,రాళ్లు లేదా విసిరే వస్తువులు సేకరించడం, అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు,డీజేలు,మైకులు వినియోగించడం,వాహనాల ద్వారా హారన్ ఉపయోగించి ప్రకటనలు చేయడం వంటి చర్యలు కూడా నిషేధితమని పేర్కొన్నారు.ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై పోలీస్ చట్టం ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సైనిక సిబ్బంది, హోం గార్డులు, నిజమైన అంత్యక్రియల ఊరేగింపులకు మాత్రమే మినహాయింపు ఉంటుందని తెలిపారు.ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి శాంతి భద్రతలను కాపాడాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## స్తంభంపల్లిలో సర్పంచ్ ప్రత్యేక చొరవతో

# మినరల్ వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం

- -రూ.3 లకే 20 లీటర్ల శుద్ధజలం సౌకర్యం - ప్రజల హర్షం - కృతజ్ఞతలు
- గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా - గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి
- స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ : బొంగాని అశోక్ గౌడ్






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేయకుండా నిలిచిపోయిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ ప్రత్యేక చొరవతో తిరిగి ప్రారంభించారు. దీని ద్వారా గ్రామ ప్రజలకు మళ్లీ శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది.గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేందుకు గేట్ వాల్స్ మరమ్మతులు,పైపు లీకేజీల నివారణ,హ్యాండ్ బోర్ల రిపేర్లు చేపట్టారు.పలు ప్రాంతాల్లో నీటి వృథాను అరికట్టడంతో పాటు సరఫరా మెరుగుపడింది.ఈ చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి, సర్పంచ్, పాలకవర్గం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడం మా బాధ్యత. సంవత్సరాలుగా మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునఃప్రారంభించడం ద్వారా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేశాం. ఇకపై ఎక్కడైనా లీకేజీలు లేదా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తాం. గ్రామాభివృద్ధికి అందరి సహకారం అవసరం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ అక్కెనపల్లి ఉపేందర్,ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, వార్డు సభ్యులు చంద్రగిరి వెంకటేష్,గంగాధర గంగజమున,అక్కెనపల్లి మధుకర్,వివిధ సంఘాల నాయకులు గంగాధర తిరుపతి,చిలుముల రమేష్, ఎర్ర గంగయ్య,కొట్టెపల్లి అనిల్, చంద్రగిరి శ్రీనివాస్,పొన్నం అరవింద్,ఎర్ర ఉదయ్,గ్రామ పంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## నూతన వార్డు సభ్యులకు రెండో విడత

# 5 రోజుల శిక్షణా కార్యక్రమం

- బోయినిపల్లి ఎంపీడీఓ : భీమా జయశీల




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) 2వ సాధారణ గ్రామ పంచాయతి ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల కోసం రెండవ విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బోయినిపల్లి ఎంపీడీఓ భీమా జయశీల తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం మార్చి 4 నుండి మార్చి 8, 2026 వరకు ఐదు రోజులపాటు కొదురుపాక గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించబడుతుందని,గ్రామ పంచాయతి పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన, బాధ్యతలు--అధికారాలపై వివరణ తదితర అంశాలపై వార్డ్ సభ్యులకు సమగ్ర శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

## వేములవాడ దర్గా వివాదంపై

# న్యాయస్థానం స్పష్టత

- ఎక్స్‌టెన్షన్ లేనట్లు వెల్లడి




వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ దర్గా అంశంపై దాఖలైన రిట్ పిటిషన్ నం. 6246/2026 పై సోమవారం తెలంగాణ హైకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ పిటిషన్‌ను గడప కిషోర్ రావు దాఖలు చేశారు.పిటిషనర్ తరపున బీజేపీ లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాది రేగుల రాజ్ కుమార్ వాదనలు వినిపించారు. విశ్వహిందూ పరిషత్ తరపున న్యాయవాదులు శివప్రసాద్, రామకృష్ణ కోర్టు దృష్టికి అంశాలను తీసుకువచ్చారు.విచారణ సందర్భంగా న్యాయస్థానం ముఖ్య వ్యాఖ్యలు చేసింది. సంబంధిత తేదీకి ఎటువంటి ఎక్స్‌టెన్షన్ ఆర్డర్ జారీ కాలేదని స్పష్టంగా తెలిపింది.ఇక, వివాదాస్పద స్థలంలో ఉన్న పాత నిర్మాణం ఇప్పటికే తొలగించబడిందని, ప్రస్తుతం అక్కడ కొత్త నిర్మాణం కొనసాగుతోందని ప్రతివాదుల తరపున కోర్టు ముందు అంగీకారం వ్యక్తమైందని విచారణలో వెల్లడైంది.ఈ పరిణామాల నేపథ్యంలో వేములవాడలో నెలకొన్న పరిస్థితులపై చట్టపరమైన స్పష్టత అవసరమని స్థానికులు అభిప్రాయపడ్డారు. హైకోర్టులో జరిగిన విచారణతో ప్రజల్లో నెలకొన్న అనేక సందేహాలకు సమాధానం లభించిందని వారు పేర్కొన్నారు.వేములవాడలో శాంతి భద్రతలు కాపాడుతూ, చట్టబద్ధ ప్రక్రియలను గౌరవించాలని ప్రజాప్రతినిధులు, సామాజిక వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

## రాష్ట్ర యువత పక్షాన పోరాడుతున్న

# నాయకులు జక్కిడి శివ చరణ్ రెడ్డి

- యూత్ కాంగ్రెస్ జిల్లాధ్యక్షులు : డాక్టర్ కౌడగాని వెంకటేష్
- కౌడగాని వెంకటేష్ నేతృత్వంలో జక్కిడి శివ చరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు - సేవా స్ఫూర్తితో యూత్ కాంగ్రెస్
- యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు : కౌడగాని వెంకటేష్ ఆధ్వర్యంలో రోగులకు పండ్ల పంపిణీ



వేములవాడ ( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేములవాడ ఏరియా ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్ మాట్లాడుతూ, "రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి యువత సమస్యలపై ఎప్పుడూ ముందుండి పోరాడుతున్న నాయకుడు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతాం. శివ చరణ్ రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో తెలంగాణ ప్రజలకు మరింత సేవ చేయాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో రత్నంపేట ఉపసర్పంచ్ రామంచ యోన బాబు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం మురళీకృష్ణ, కోనరావుపేట మండల అధ్యక్షులు బండి ప్రభాకర్, వేములవాడ అర్బన్ ఉపాధ్యక్షుడు బొమ్మ తిరుపతి, ఇర్ఫాన్ షేక్, అక్కి సునీల్,షాహిద్ పాషా,భాను, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్



తార్నాక(ప్రశ్న న్యూస్) నారాయణ పాఠశాలలో ఘనంగా స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో భాగంగా 1,2 తరగతుల విదార్థులు వారు అన్ని సబ్జెక్టుల నుండి ఈ విద్యా సంవత్సరంలో నేర్చుకున్న పాఠాలను వ్యాకరణాంశాలను అనర్గలంగా స్వయంగా వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిఎం గోపాల్ రెడ్డి, ఏజిఎం బాలపరమేశ్వరావు లు మాట్లాడుతూ చిన్నారి పిల్లలు వారి మేధాశక్తితో వారి ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాల సహాయంతో పాఠంలో ఉన్న ముఖ్య విషయాలు వారు ఆ పాఠం ద్వారా ఏమి నేర్చుకున్నారో ఎంతో చక్కగా వివరించడం ఆనందాన్ని కలిగించిందన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థులలోని నైపుణ్యాలను వెలిక్కి తీయవచ్చు అన్నారు. వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు ఇంకా ఈ కార్యక్రమానికి ఈ చాంప్స్. ఆర్ డి.హెడ్, మహేశ్వరి, ఈ చాంప్స్. కో-ఆర్డినేటర్ లక్ష్మీ భవాని, ఈ-చాంప్స్ వి.పి, సరిత, ఈ. కిడ్జ్-వి.పి. షాహీన్, పి.ఇ.టి, నరేష్, ఎ.ఒ మహేందర్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం

- గుమ్మిడిపూడి తహశీల్దార్ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్-తమిళనాడు సరిహద్దు సమస్యల పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వాహణ- కలెక్టర్ వేంకటేశ్వర్



తిరుపతి(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్-తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో మత్స్యకారులకు ఎదురవుతున్న అంతర్‌రాష్ట్ర సమస్యల శాశ్వత పరిష్కారం త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పులికాట్ సరస్సు పరిధిలో జీవనోపాధి కొనసాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు ఇటీవలి కాలంలో ఎదుర్కొంటున్న వివాదాలు, సరిహద్దు సమస్యలు, భద్రతా అంశాలు వంటి విషయాలపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్, తిరుపతి ఎస్. పి సుబ్బరాయుడు, డి. ఆర్. ఓ. జి. నరసింహులు, సంబంధిత ఉన్నతాధికారులతో కలసి తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఎస్. పి వివేకానంద శుక్లా లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధి రక్షణ పై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇరు రాష్ట్రాల జిల్లాలలో సరిహద్దు ప్రాంతాలపై స్పష్టత లేకపోవడం వల్ల మత్స్యకారుల మధ్య అపోహలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. గతంలో చోటుచేసుకున్న సంఘటనలను సమీక్షించి, భవిష్యత్తులో అలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు సూళ్లూరుపేట ఆర్. డి. ఓ దేవేందర్ రెడ్డి, సూళ్లూరుపేట, గుమ్మడిపూడి డి. ఎస్. పి. లు, సూళ్లూరుపేట డి. ఎఫ్. ఓ, తిరుపతి జిల్లా మత్స్య శాఖ అధికారి, తమిళనాడు తిరవల్లూరు మత్స్య శాఖ అధికారి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో రక్తదానం



నాచారం(ప్రశ్న న్యూస్) ఒకరి రక్తం దానంతో కొందరి ప్రాణాలను కాపాడుకోవచ్చునని రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్ఎస్ఎస్ యువసేన వ్యవస్థాపకుడు మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి ఉత్సవాలను ఎస్ ఎస్ యువసేన ఆధ్వర్యంలో వారం రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీపాద రావు జయంతి సందర్భంగా ఎస్ ఎస్ ఎస్ యువసేన ఆధ్వర్యంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ 90 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఎస్ ఎస్ యువసేన ఎంత ఉత్సాహంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడంపై అభినందించారు. తన తండ్రి ఆశయాలను స్మరించుకున్నారు. ప్రజాసేవరాజకీయ విలువలకు ఆయన ప్రాధాన్యతనిచ్చారని ఆ బాటలోనే తాను నడుస్తున్నానని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నిబద్ధతతో ప్రజలకు సేవ చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ శ్రీపాదరావు రాష్ట్రానికి చేసిన సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు. పెద్ద ఎత్తున విచ్చేసి రక్తదాన శిబిరం లో పాల్గొన్న యువకులను, సహకరించిన కార్యకర్తలను నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఎస్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సహజ రంగులతో హోళీ పండుగను శాంతియుతంగా జరువుకుందాం

**- ప్రజలందరికీ " హోళీ పండుగ శుభాకాంక్షలు"**

**- భాజపా కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు, సామాజిక సేవకులు : అనుమల్ల చంద్రమౌళి**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) హిందువుల పవిత్ర పండుగలలో పవిత్ర హోళీ పండుగను శాంతియుతంగా, పర్యావరణ హితంగా జరుపుకోవాలని భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు,సామాజిక సేవకులు అనుమల్ల చంద్రమౌళి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన రంగులను వినియోగించకుండా సహజ రంగులతో హోళీ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నీటి వృథాను నివారిస్తూ, చిన్నారులు-వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా పరస్పర గౌరవంతో పండుగను జరుపుకోవాలని కోరారు. ప్రజలకు ఆయన హృదయపూర్వక హోళీ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇరాన్ నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మృతిపై హైదరాబాదులో నిరసనలా.?

**- ఇరాన్ అధ్యక్షుడు అయతొల్లా అలీ ఖమేనీ హత్యపై హైదరాబాదులో నిరసనల బీజేపీ నేతల ఆగ్రహం**

**- విదేశీ నాయకుల హత్యలపై భారత దేశంలో నిరసనలు ఎందుకు**

**- భారతదేశంలో ఇతర దేశాల నాయకుల కోసం నిరసనలు చేయవద్దంటున్న బిజెపి నేతలు**

**- భారతదేశ శత్రువులకు ఆయన మిత్రుడు, ఇక్కడ నిరసనలు ఎలా చేస్తారు.?**



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) భారత దేశంలో ఇరాన్ నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మృతిపై హైదరాబాదులో నిరసనలు ఎందుకు చేయడం అంటూ బిజెపి నేతలు బగ్గుమంటున్నారు. వివరాల్లోకి వెళితే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ యుద్ధంలో మరణించిన సంగతి అందరికీ తెలిసిందే అయితే హైదరాబాద్ మహానగరంలో ఓల్డ్ సిటీ, మౌలాలిలో నిరసనలు వ్యక్తం చేస్తుంటే పోలీసులు ఎందుకు ఆపడం లేదంటూ బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో హైదరాబాద్ మహానగరం లాంటి ప్రాంతాలలో మతపరమైన ర్యాలీలు నిరసనలు తెలపాలంటే అనుమతులు తప్పనిసరి అని పోలీస్ శాఖ చెబుతుంది. మన స్థానిక సమస్యలపై నిరసనలు చేస్తే అరెస్టులు చేసి కేసులు పెట్టి పోలీసులు మౌలాలిలో ఇరాన్ దేశ సుప్రీమ్ లీడర్ హత్యపై నిరసనలు వ్యక్తం చేస్తున్న మౌలాలి వాసులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ బిజెపి నేతలు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పిస్తున్నారు. మన దేశ నాయకుడు కానప్పుడు ఇలా నిరసనలు వ్యక్తం చేస్తుంటే ఎందుకు పోలీసులు సహకరిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలంటూ పలువురు బిజెపి నేతలు అంటున్నారు. ఇలా నిరసనలు వ్యక్తం చేయడానికి పోలీసులు మౌనం వహిస్తే భవిష్యత్తులో మరింత ప్రమాదం పొంచి ఉంటుందని దేశభద్రతకే ప్రమాదం సంభవించే సూచనలు కనిపిస్తున్నాయి అంటున్నారు. మన శత్రుదేశాలకు ఆయన మిత్రుడు అంటే మనకు శత్రువు అన్నట్లే అలాంటి వాళ్ళ మృతిపై మన దేశంలో ఉంటూ ఇతర దేశ నాయకుల పై నిరసనలు వ్యక్తం చేయడం సమంజసం కాదని మన దేశంలో మతపరమైన సమస్యలు వాటిల్లకుండా చూసే బాధ్యత పోలీసులదే అని బిజెపి నేతలు మండిపడుతున్నారు. పోలీసులు కొంతమందికి అంగీకారం తెలిపి స్థానిక సమస్యలపై దేశ సమస్యలపై నిరసనలు చేస్తే ఆగమేఘాల మీద ప్రత్యక్షమై కేసులు నమోదు చేయడం లాఠీచార్జీలు చేయడం చేస్తారు. మన సమస్యలపై నిరసనలు చేస్తే చట్టాలు గుర్తుకు వస్తాయి కానీ ఇతర దేశాల నాయకుల కోసం బహిరంగంగా ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగిస్తూ నలుగురిని ఇబ్బంది పెడుతూ నిరసనలు చేస్తే మాత్రం ఎవరికీ కనిపించకపోవడం విడ్డూరంగా మారిందని బిజెపి నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# అధికార దాహం - అల్లాడుతున్న పర్యావరణం



ప్రస్తుత ప్రపంచం ఒక భయంకరమైన సంక్షోభంలో కూరుకుపోయింది. అగ్రరాజ్యాల అహంకారం వల్ల భూగోళం మొత్తం ఒక డేగ రెక్కల కింద విలవిలలాడుతున్న పక్షిలా మారిపోయింది. బలవంతుడిదే రాజ్యమన్నట్లుగా వ్యవహరిస్తూ తమ మాట వినని దేశాలపై బాంబుల వర్షం కురిపించడం, ఆక్రమణలకు పాల్పడటం నిత్యకృత్యమైంది. ఇరాన్ లో జరిగిన విధ్వంసం కావచ్చు, ఆ దేశాధినేతల మరణాలు కావచ్చు, ఇవన్నీ ప్రపంచ మానవాళిని తీవ్రంగా కలచివేస్తున్నాయి. గతంలో వెనిజులా వంటి దేశాల్లో జరిగిన పరిణామాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

సంపదను దోచుకోవడమే లక్ష్యంగా, చమురు నిక్షేపాలను హస్తగతం చేసుకోవడమే ధ్యేయంగా సాగుతున్న ఈ దాడుల వల్ల అమాయక ప్రజలు బలి కావడమే కాకుండా ప్రకృతి సైతం కోలుకోలేని విధంగా దెబ్బతింటోంది. విచిత్రమేమిటంటే, అణ్వాయుధాలు లేని దేశాలపై విరుచుకుపడే శక్తులు, అణ్వస్త్రాలు ఉన్న దేశాల జోలికి వెళ్లడానికి సాహసించడం లేదు.

ఇది కేవలం భీరుత్వంతో కూడిన ఆధిపత్యం మాత్రమే. ఉత్తర కొరియా వంటి దేశాల విషయంలో వ్యక్తమయ్యే భయం, ఇతర దేశాల విషయంలో చూపే క్రౌర్యం అగ్రరాజ్యాల ద్వంద్వ నీతిని ఎండగడుతున్నాయి. ఈ యుద్ధాల వల్ల కేవలం మనుషులు మాత్రమే చనిపోవడం లేదు, జీవవైవిధ్యం నాశనమవుతోంది. భూమి తన సహజత్వాన్ని కోల్పోయి రసాయనాలమయంగా మారుతోంది. పెట్రోల్ మరియు ఇతర సహజ వనరుల కోసం జరిగే ఈ రక్తపాతం ఆగకపోతే భవిష్యత్ తరాలకు మిగిలేది కేవలం వల్లకాడు మాత్రమే.

ప్రకృతి మనుగడ సాగాలన్నా, శాంతి వర్ధిల్లాలన్నా ఇలాంటి మూర్ఖపు ఆలోచనలు నశించాలి.

ప్రపంచం మొత్తం ఏకమై ఈ అరాచకత్వాన్ని ఎదిరించవలసిన సమయం ఆసన్నమైంది.



**సింహాచలం లక్ష్మణ స్వామి**
**కవి, రచయిత**
**ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు**

# మనస్సులోని మలినాలను దహించి సత్స్వరూపాన్ని పొందాలనేదే హోళి పండుగ పరమార్థం



హోలీ పండగ అంటే కేవలం రంగులు చల్లుకోవడం మాత్రమే కాదు. మనస్సులో నిక్షిప్తమైన కల్మషాలు, అహాన్ని హోలికా దహనంలో దహించేసి కొత్త ఆశలు, ప్రేమానురాగాలతో జీవితాన్ని రంగులమయం చేసుకోవడమే హోలీ పండుగ పరమార్థం.సనాతన ధర్మంలో సంప్రదాయాలు, పండుగలు, ఆచారాల్లో లోతైన ఆధ్యాత్మిక కారణాలు, పురాణా కథనాలు, సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన నిగూఢ విషయాలు దాగి ఉన్నాయి. చెడుపై మంచి సాధించిన విజయాలను స్మరించుకోవడమే కాక ధర్మం ఎప్పటికి నిలిచిపోతుందనే విస్వాసాన్ని బలపర్చడమే పండగల ముఖ్య ఉద్యేశం. కలియుగ ప్రభావం లో అధర్మం ఎంత విస్తరించినను చివరికి ధర్మమే విజయం సాదిస్తుదనే భావనను మన పండగలు గుర్తుచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు వయెభేధం లేకుండా ఎంతో కోలాహలంగా రంగులు చల్లుకుంటు జరుపుకునే హోలీ పండగ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. అయితే హోలీ పండగ ప్రత్యేకత, కామదహన ప్రాముఖ్యత గురించి తెలుసుకుందాం

### హోలికా

పురాణా కథనాల ప్రకారం రాక్షస రాజైన హిరణ్యకష్యపుని సోదరే హోలికా. జన్మతః విష్ణు భక్తుడైన ప్రహ్లాదున్ని భక్తి మార్గం నుండి దృష్టి మరల్చేందుకు విష్ణుమూర్తిని ద్వేషించే హిరణ్య కష్యపుడు ఎన్నో విధాలుగా ప్రయత్నించినను విష్ణుమూర్తి తన భక్తుడైన ప్రహ్లాదున్ని అన్ని ఆపదల నుండి కాపాడుకుంటారు. దీంతో హిరణ్యకష్యపుడు ఒక కఫట పనాగంతో అగ్నిలో దహనం కాకుండ వరం పొందిన తన చెల్లెలు హోలీకతో ప్రహ్లాదున్ని ఒడిలో పెట్టుకొని అగ్నిలో కూర్చోవాలని ఆజ్ఞాపించాడు. కానీ దైవ సంకల్పంతో విష్ణు భక్తుడైన ప్రహ్లాదుడు అగ్ని నుండి క్షేమంగా బయటకు రాగా దురుద్దేశంతో ప్రహ్లాదునికి కీడు తలపెట్టబోయిన హోలీకా మాత్రం అగ్నికి ఆహుతైపోవడంతో ఈ ఘటన చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచింది. హోలికా దహనాన్ని పురస్కరించుకుని ప్రజలు ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకుంటు సంబరాలు చేసుకున్నారు.

### హోలికా దహనం

హోలీ పండగకు ముందురోజు హోలికా దహనం జరుపుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. వీధుల్లో కట్టెలు పేర్చి చెక్కతో చేసిన హోలికా బొమ్మను దహనం చేస్తారు. దీనితో చెడు, అహంకారం, అసూయ వంటి దుష్పరిణామాలు దహించబడాయని ప్రజలు విశ్వసిస్తారు. హోలికా దహనం తర్వాత వచ్చే బూడిదను పవిత్రంగా భావించి నుదుటన బొట్టు పెట్టుకుంటారు. హోలికా దహనాన్ని పురస్కరించుకుని మరుసటిరోజు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకొని హర్షాతిరేకాలతో హోలీ పండుగ జరుపుకొని తీపి వంటకాలను శ్రీకృష్ణునికి నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

### కామదహన విశిష్టత

పురాణాల్లో మరో కథ ప్రాచుర్యం సంతరించుకుంది. పరమేశ్వరున్ని వివాహం చేసుకోవాలనే సంకల్పం తో పరమశివుని తపస్సును భంగంపరచాలని పార్వతీ దేవి కామదేవున్ని ప్రార్థిస్తుంది. దీంతో కామదేవుని వల్ల పరమశివుని ఏకాగ్రతకు భంగం కలగడంతో ఆగ్రహించిన శివుడు తన మూడవ కన్ను తెరిచి కామదేవున్ని భస్మం చేస్తాడు. దీంతో కామదేవుని భార్య రథిదేవి ప్రార్ధనతో పరమశివుడు కామదేవున్ని తన అనంగ రూపంలో పునర్జీవింపచేస్తాడు. ఈ సంఘటన మనిషిలోని అశ్రేయస్కార కోరికలను నియంత్రించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది.

### హోళీ పండగ సందేశం

హోలికా దహనం, కామ దహనం వంటి ఆచార, సంప్రదాయాలు కేవలం పురాణాల గాథలే కావు. ఇవి మనలోని అహంకారం, అసూయ, అధర్మం, కోపం, అశ్రద్ధ లను ధహింప చేసి సత్సంకల్పంతో జీవించాలనే నిగూఢ సత్యాన్ని మనకు అందిస్తున్నాయి. రంగుల పండుగగా ఆనందాన్ని పంచుతు మనలోని మలినాలను తొలగించి సత్స్వరూపాన్ని పొందలనేదే హోలీ పండగ పరమార్థం. హోలీ పండుగను కేవలం సంబరాలకే పరిమితం కాకుండా అంతరార్థాన్ని గ్రహించి ధర్మపథంలో నడిచే సంకల్పంతో జరుపుకుంటే హోలీ పండుగ మరింత శోభాయమానంగా మారుతుంది.



**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట రంగారెడ్డి (జిల్లా)**

# న్యాయ సేవ కోసం కోర్టు తలుపులు తట్టే ప్రతి వ్యక్తికి న్యాయం లభిస్తుందన్న విశ్వాసం కల్పించాల్సిన భాద్యత న్యాయమూర్తులదే

## భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

తిరుపతి (ప్రశ్న న్యూస్) న్యాయ సేవల కోసం కోర్టు తలుపులు తట్టే వేలాది మందికి న్యాయం లభిస్తుందన్న విశ్వాసం కల్పించాల్సిన భాద్యత న్యాయమూర్తులందరి పై ఉందని భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి రూరల్ మండలం దామినేడు వద్ద సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీ లతో కలసి 16 కోర్టు భవనాల నూతన కోర్టు సముదాయ భూమి పూజ , శిలాఫలకాన్ని ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ నినాల జయసూర్య, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ డొనాది రమేష్, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరరావు కుంచం, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ టి.సి.డి. శేఖర్, డిఐజీ షిమోజి బాయ్, చిత్తూరు జిల్లా ఉమ్మడి డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక, అడిషనల్ జిల్లా జడ్జి గురునాథం, తిరుపతి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి .గజేంద్ర, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, తిరుపతి ఆర్టీవో రామ్మోహన్ ,బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టు సముదాయాలు ఆసుపత్రుల్లా పనిచేయాలని నేను ఎప్పటి నుంచో చెబుతున్నాని, ఆసుపత్రికి వెళ్లిన రోగికి మొదట ప్రాథమిక చికిత్స అందించినట్లే, కోర్టుకు వచ్చే ప్రతి వ్యక్తికి కూడా భద్రత న్యాయం లభిస్తుందనే నమ్మకం కలగాలన్నారు. ఈ బాధ్యత బార్ బెంచ్ రెండింటి పై సమానంగా ఉంటుందన్నారు. ఈ కొత్త న్యాయస్థాన సముదాయం కూడా "న్యాయ దేవాలయం"గా మారాలని నేను కోరుకుంటున్నానని, ఇక్కడికి వచ్చే ప్రతి వ్యక్తి న్యాయం పొందిన ఆనందంతో వెళ్లాలన్నారు. తిరుపతి బార్ కు ఉన్న మేధస్సు, చారిత్రాత్మక వారసత్వం, మేధో సంపత్తి తో మరింత వికసించాలని ఆకాంక్షించారు.న్యాయ వ్యవస్థలో బార్ అసోసియేషన్ ఒక అవిభాజ్య భాగమని, న్యాయం అందించడం కేవలం బెంచ్ బాధ్యత మాత్రమే అనే భావన ఒక అపోహన్నారు. ముఖ్యంగా గర్వించదగిన సంప్రదాయం కలిగిన తిరుపతి బార్ అసోసియేషన్ వారికి ప్రత్యేకంగా చెబుతున్నానన్నారు. బార్ బెంచ్ ప్రత్యర్థులు కావని, అవి ఒకే సంస్థకు చెందిన రెండు చేతులన్నారు. బలమైన బార్ అసోసియేషన్ మంచి వాదనలను అందిస్తుందని, మంచి వాదన న్యాయమూర్తులను మరింత లోతుగా ఆలోచించడానికి, జాగ్రత్తగా విశ్లేషించడానికి, స్పష్టంగా తీర్పులు రాయడానికి ప్రేరేపిస్తుందన్నారు. బార్ అసోసియేషన్ అందించే సహకారం ఎంత నాణ్యమైనదైతే, న్యాయమూర్తి పనితీరు కూడా అంతే మెరుగ్గా ప్రతిఫలిస్తుందన్నారు. మీరు ఎంత బాగా వాదిస్తే, తీర్పుల నాణ్యత అంత మెరుగ్గా ఉంటుందన్నారు. మంచి కారణాలతో ఇచ్చిన తీర్పులు ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతాయని, త్వరలో నిర్మించబడనున్న ఈ కొత్త కోర్టు సముదాయం న్యాయవాదులకు తగిన పని వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. జస్టిస్ ఎ.కె. మహేశ్వరి న్యాయ మౌలిక సదుపాయాల ప్రాముఖ్యత, విలువ



అవసరాన్ని వివరించారన్నారు. కోర్టు భవన నిర్మాణం పూర్తయ్యాక కేవలం రాళ్లు, గోడలు లేదా భవనం మాత్రమే ముఖ్యమైనవి కావని, నా దృష్టిలో, భవనం నిర్మాణం పూర్తై, ఆధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరికరాలు ఏర్పడి, బార్ సభ్యులు, న్యాయవ్యవస్థ, సిబ్బంది అందరూ సాంకేతికతో సిద్ధంగా ఉన్నప్పుడు సవాళ్ళు ప్రారంభం అవుతాయన్నారు. ఇందులో అందుబాటులో ఉండే ఖర్చుతో న్యాయాన్ని ప్రజలకు చేరవేయడం ఒకటైతే నిర్దిష్ట కాలపట్టికతో, ముందుగా ఊహించగలిగే విధంగా న్యాయ నిర్ణయ వ్యవస్థను అమలు చేయడం రెండవ సవాలు అన్నారు.ఈ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి, భారత సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులకు శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి శ్రీవారి ప్రతిమలను బహుకరించి సత్కరించారు.

# మేడ్చల్ ఎస్.ఎస్.జీ హైస్కూల్‌లో

## మిన్నంటిన ఉత్సాహం ఘనంగా విద్యా ప్రదర్శన



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని నిరూపిస్తూ, మేడ్చల్ పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ ఎస్.ఎస్.జీ హైస్కూల్‌లో ఆదివారం ఎడ్యుకేషన్ ఫెయిర్ అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల వినూత్న ఆలోచనలు, ప్రయోగాలతో సందడిగా మారింది. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ శాస్త్రవేత్త ఎదుగని లింగం, మేడ్చల్ మాజీ జడ్పిటిసి జే.కే శైలజహరినాథ్, మాజీ మేడ్చల్ పురపాలక సంఘం వైస్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగ్స్ బిట్స్ మరియు మ్యాథమెటిక్స్ సంబంధించిన మోడల్స్ వర్కింగ్ మోడల్స్ అంతేకాకుండా సోషల్ డిపార్ట్మెంట్ మరియు తెలుగు హిందీ డిపార్ట్మెంట్లు వారు చేసినటువంటి సృజనాత్మకమైన వర్కింగ్ మోడల్స్ ని చూసి పిల్లల్ని అభినందించారు.

# బీర్పూర్ సరిహద్దుల్లో ‘హైనా’ జంతువు అలజడి

**ప్రాణాలు దక్కాలంటే అప్రమత్తమే మార్గం!**

**- పొలాల వద్దకు వెళ్లాలంటే జంకుతున్న రైతులు**

**ప్రజాప్రతినిధుల అత్యవసర హెచ్చరిక!**



బీర్పూర్ (ప్రశ్న న్యూస్) బీర్పూర్ పరిధిలోని అరగుండాల ప్రాజెక్టు సమీప అటవీ ప్రాంతంలో ప్రమాదకరమైన హైనా (దుప్పిలి) సంచరిస్తుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రూర మృగం కదలికలను గుర్తించిన కొల్వాయి సర్పంచ్ రంగు లక్ష్మణ్‌తో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు ప్రజలను అప్రమత్తం చేశారు., ముఖ్యంగా కొల్వాయి, మంగేలా, తాళ్ల ధర్మారం, రేకులపల్లి, చర్లపల్లి, తుంగూరు, నరసింహుల పల్లె, కమ్మనూరు, కండ్లపల్లి మరియు రంగాసాగర్ గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు మరియు పశువుల కాపరులు అటవీ ప్రాంతం వైపు వెళ్లేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా సాగు పనుల కోసం పొలాల వద్దకు వెళ్లే రైతులు ఒంటరిగా వెళ్లకూడదని, పొలాల వద్ద రాత్రి సమయాల్లో కాపలా ఉండే వారు టార్చ్ లైట్లు, కర్రలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల కాపరులు తమ గొర్రెలు, బర్రెలను మేత కోసం అడవి లోపలికి ఒంటరిగా తీసుకెళ్లవద్దని, ఎల్లప్పుడూ గుంపులుగా ఉండాలని కోరారు. సాయంత్రం వేళల్లో చీకటి పడకముందే నివాసాలకు చేరుకోవాలని సర్పంచ్ రంగు లక్ష్మణ్, సర్పంచులు మురళి మరియు ఇతర గ్రామ పంచాయతీ పాలకవర్గాలు విజ్ఞప్తి చేశాయి. బీర్పూర్ మండల అటవీ శాఖ అధికారులు కూడా ఈ ప్రాంతంలో నిఘా పెంచాలని, క్రూర మృగం జనావాసాల్లోకి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది




వేములవాడ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ హైటెక్ సిటీలోని శిల్పకళ వేదిక లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిర్వహించారు. జయంతి వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీపాదరావు సేవలను స్మరించుకుంటూ, ఆయన ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసిన కృషిని కొనియాడారు. ప్రజా విలువలకు కట్టుబడి నిస్వార్థంగా పనిచేసిన నాయకుడిగా ఆయన పేరు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

## హోళీ పండుగను శాంతియుతంగా జరుపుకుందాం

**- జిల్లా ప్రజాలందరికీ “హోళీ పండుగ శుభాకాంక్షలు”**

**- వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షురాలు : గంగాధర గంగజమున - వెంకటరమణ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) హోళీ పండుగను ఆనందోత్సాహాలతో పాటు పర్యావరణానికి హాని కలగకుండా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు,వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షురాలు గంగాధర గంగజమున - వెంకటరమణ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. హోళీ అనేది రంగుల పండుగ మాత్రమే కాకుండా స్నేహం, సౌభ్రాతృత్వం, సామరస్యానికి ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. ఈ పండుగను జరుపుకునే సమయంలో రసాయనాలున్న రంగులను ఉపయోగించడం వల్ల చర్మ వ్యాధులు, కంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని సూచించారు. అందువల్ల సహజ వనరులతో తయారైన ప్రకృతి రంగులు లేదా పూల రేకులతో హోళీ ఆడాలని ప్రజలను కోరారు. అలాగే నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురికాకుండా పరస్పర గౌరవంతో పండుగను జరుపుకోవాలని సూచించారు. హోళీ వేడుకల పేరుతో ఎలాంటి అల్లర్లు, అసభ్య ప్రవర్తనకు తావులేకుండా శాంతి భద్రతలను కాపాడాలని అన్నారు. జిల్లాలో సోదరభావం, ఐక్యత మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, అందరికీ ఆరోగ్యకరమైన, సురక్షితమైన హోళీ పండుగ కావాలని గంగజమున - వెంకటరమణ ఆకాంక్షించారు.

# రుణాలకు సిబిల్ స్కోర్ పరిగణలోనికి తీసుకోవద్దు

## మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )సంక్షేమ శాఖల ద్వారా అందించే రుణాలకు సిబిల్ స్కోర్ పరిగణలోనికి తీసుకోకుండా, ప్రాసెసింగ్ ఫీజు నామమాత్రంగా ఉండేలా చూడాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బ్యాంక్ అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డిసిసి సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్, విజయేందర్ రెడ్డి, మల్కాజిగిరి ఎంఎల్ఎ మర్రిరాజశేఖర్ రెడ్డి, ఆర్బిఐ డిజిఎం , నాబార్డు జిఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టె ప్రతి పథకం ద్వారా నిరుపేదలు ఉపయోగించుకునేలా బ్యాంకు అధికారులు వారికి పూర్తి అవగాహన కల్పించడమే కాకుండా వారికి అవసరమైన మార్గనిర్దేశం అందించాలని అన్నారు. వ్యవసాయానికి, పరిశ్రమలకు అందించే రుణాలను కాలాయాపన లేకుండా నిర్ణీత గడువులోగా ఇవ్వాలన్నారు. తమ నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాల పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని, అట్టి వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రుణాలు తీసుకున్న లబ్దదారులు సకాలంలో చెల్లించడం ద్వారా సిబిల్ స్కోర్ పెరగడంతో పాటు భవిష్యత్తులో సులభతరంగా మరిన్ని రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టె పథకాలను బ్యాంకుల ద్వారా పేదవర్గాల ప్రజలకు అందించి వారి అర్థికాభివృద్ధికి దోహాదపడాలని, అందుకు బ్యాంకర్లు ప్రభుత్వ పథకాల పై ప్రజలలో అవగాహన కల్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2025-26 ఆర్థిక సంవత్సరంలో ని రూ. 28160.71 కోట్లు లక్ష్యాలకు గాను రూ. 24900.93 కోట్లు చేరుకున్నారన్నారు . పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలి అని తెలిపారు. మేడ్చల్-- మల్కాజ్గిరి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ( పి ఎల్ పి ) (2026-27 సంవత్సరానికి గాను ప్రణాళిక పుస్తకం విడుదల చేయడం జరిగింది. ఈ ప్రణాళిక ద్వారా మొత్తం రూ. 33,229.71 కోట్లు లక్ష్యంగా నిర్దేశించామని, బ్యాంకర్లు తమ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ విజయేంద్ర రెడ్డి, మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రాధాన్యతా రంగంలో విద్యా రుణాల రుణ మెరుగుదల, సీడీ నిష్పత్తి 60 శాతం కంటే తక్కువగా సాధించకపోవడం గురించి ఎత్తి చూపబడింది. బ్యాంకర్లు ఈ సమావేశాలకు రాకపోవడం గురించి ఎస్ ఎల్ బి సి,ఆర్బిఐ కి నివేదించి, ఆ బ్యాంకర్లకు తెలియజేయాలి, సమాధానాలు పొందాలి అన్నారు. ఈ సమస్యపై సరైన చర్యల కోసం రాష్ట్ర నియంత్రణ సమావేశాల కోసం ఎస్ ఎల్ బి సి కి ఆర్బిఐ కి కూడా తెలియజేయాలి. పీఎం జేజే బి వై, పీఎం ఎస్బిఐ 60 శాతం కంటే ఎక్కువ సాధించాలని అన్ని బ్యాంకులు సూచించాయి. బ్యాంకులు నూతన శాఖలు కొత్త ప్రారంభానికి స్థానిక ప్రజా అవగాహన కోసం స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా గిరిజన అధికారి పద్మజా, వివిధ బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యువ నాయకత్వానికి దక్కిన అరుదైన గౌరవం

**మామిండ్ల రాహుల్ యాదవ్ తో రాహుల్ గాంధీ సెల్ఫీ**

**ఆకర్షించిన ఆత్మీయత**

**యువతకు ప్రాధాన్యత ఇస్తున్న రాహుల్ గాంధీ**

**భవిష్యత్తు నాయకత్వానికి సంకేతం**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )రాజకీయాల్లో అట్టడుగు స్థాయి నుండి కష్టపడి పైకి వచ్చే యువ నాయకులకు అగ్రనేతల ప్రోత్సాహం లభిస్తే వారి ఉత్సాహం రెట్టింపవుతుంది. సరిగ్గా అదే జరిగింది తెలంగాణ ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాహుల్ యాదవ్ విషయంలో. ఆదివారం సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు వస్తున్న విమానంలో కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ రాహుల్ గాంధీని రాహుల్ యాదవ్ పలకరించి పరిచయం చేసుకోగా వెంటనే రాహుల్ యాదవ్ ఫోన్ తీసుకుని రాహుల్ గాంధీ సెల్ఫీ తీసి ఇచ్చాడు. ఇప్పుడు ఆ సెల్ఫీ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

### ఆకర్షించిన ఆత్మీయత..

సాధారణంగా అగ్రనేతలను కలవడమే కష్టమైన తరుణంలో రాహుల్ గాంధీ ఎంతో ఆత్మీయంగా మామిండ్ల రాహుల్ యాదవ్‌తో ముచ్చటించడం చర్చనీయాంశమైంది. తెలంగాణలో విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ, విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న రాహుల్ యాదవ్ కృషిని ఈ సెల్ఫీ ప్రతిబింబిస్తోందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.

### యువతకు ప్రాధాన్యత ఇస్తున్న రాహుల్ గాంధీ..

?రాష్ట్ర స్థాయిలో ఎన్.ఎస్.యు.ఐ బలోపేతానికి మామిళ్ళ రాహుల్ యాదవ్ చేస్తున్న కృషికి ఈ ఫోటో ఒక గుర్తింపుగా నిలిచింది. యువతకు ప్రాధాన్యత ఇచ్చే రాహుల్ గాంధీ, తెలంగాణ యువ నేతలను పేరు పేరునా పలకరిస్తూ వారిలో నూతనోత్తేజాన్ని నింపారు. ?ఈ ఫోటో బయటకు వచ్చిన కొద్దిసేపటికే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులు మరియు ఎన్.ఎస్.యు.ఐ కార్యకర్తలు దీనిని షేర్ చేస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

### భవిష్యత్తు నాయకత్వానికి సంకేతం..

రాహుల్ గాంధీ వంటి జాతీయ స్థాయి నేతతో సెల్ఫీ దిగడం కేవలం ఒక ఫోటో మాత్రమే కాదని, అది పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు దక్కే గౌరవమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మామిండ్ల రాహుల్ యాదవ్ నాయకత్వంలో తెలంగాణలో విద్యార్థి విభాగం మరింత బలోపేతం అవుతుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. నాయకుడి ప్రోత్సాహం ఉంటే సామాన్య కార్యకర్త కూడా అసామాన్య విజయాలను సాధించగలడు.

# సీఎం దృష్టికి మంచి నీటి సమస్య



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మేడ్చల్ పట్టణంలో నెలకొన్న మంచినీటి సమస్య ను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి బిజెపి నేతలు తీసుకెళ్లారు. ప్రభుత్వ సచివాలయం లోని ముఖ్య మంత్రి కార్యాలయ పేషిలో వినతి పత్రం ఇచ్చారు. లక్షకు పైగా నివసిస్తున్న మేడ్చల్ నగరంలో మిషన్ భగీరథ మంచి నీటి సరఫరా గత 10 నెలలుగా నాలుగు ఐదు రోజులకు ఒక్కసారి, కొన్ని బస్తీ కాలనీల్లో పూర్తిగా రాకపోవడం లేదని తెలిపారు. ఈ విషయంలో ముఖ్య మంత్రి జోక్యం చేసుకొని ఘనపూర్ లోని పంప్ హౌస్ పునరుద్ధరణ ఉత్తర్వులు ఇవ్వాలని ముఖ్య మంత్రి పేసీలో ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నేత పాతూరి సుధాకర్ రెడ్డి నేతలు కానుకంటి వంశీ విజయ్ వంజరి, బీజేపీ మేడ్చల్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి, జాకెట బాబు రాజ్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు..

## మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మేడ్చల్ మల్కాజ్గిరి అదనపు జిల్లా కలెక్టర్ విజేందర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ (ఇంఛార్జి) చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం చేయకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ (ఇంఛార్జి) చంద్రావతి లతో కలిసి అదనపు కలెక్టరు (153) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఈరోజు హౌజింగ్ డిపార్టుమెంట్ కు అధిక సంఖ్యలో (53) దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలీవుడ్‌లో పెరుగుతున్న మైలేజ్

అవకాశాలు పెరగడం, తరగడం అనేది ఫలితాలను బట్టి ఉంటాయంటారు. కానీ ఈ విషయంలో శ్రీలీలను మాత్రం మినహాయించాలి. ఎందుకంటే.. తనకు ఫలితాలు చేదు అనుభవాలను ఇస్తున్నా.. అవకాశాలు మాత్రం పోటెత్తుతూనే ఉన్నాయి. బహుశా చందమామతో పోటీపడే ఆమె అందమే ఈ అవకాశాలకు కారణం కావొచ్చు. ప్రస్తుతం బాలీవుడ్‌లో అనురాగ్ బసు సినిమాలో శ్రీలీల నటిస్తున్న విషయం తెలిసిందే.. ఇటీవలే ఇందులోని ఆమె పాత్ర గురించి అనురాగ్ బసు మాట్లాడారు. ఈ సినిమాలో శ్రీలీల నటనకు ప్రశంసలు దక్కుతాయని, అంతేకాక, బాలీవుడ్ అగ్రనిర్మాణ సంస్థల్లో తను అవకాశాలు దక్కించుకోవడం ఖాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ బాలీవుడ్ మీడియాలో వైరల్‌గా మారి, శ్రీలీలకు మంచి మైలేజ్‌నే తెచ్చాయి. ప్రస్తుతం తమిళంలో ధనుష్‌కు జోడీగా ఓ పానిండియా సినిమాలో నటిస్తున్నది శ్రీలీల. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది. ఇక పవన్‌కల్యాణ్‌కు జోడీగా ఆమె నటించిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా ఈ నెల 26న విడుదల కానున్న విషయం తెలిసిందే.



# నవ్విస్తూ భయపెట్టే రాకాస



'కమిటీ కుర్రోళ్లు' తర్వాత నిహారిక కొణిదెల తీసుకొస్తున్న మరో డిఫరెంట్ మూవీ 'రాకాస'. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన ఈ హారర్ కామెడీ మూవీకి మానసశర్మ డైరెక్టర్. ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఈ క్రమంలో మేకర్స్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. 'నరకం నుండి సందేశం వస్తుంది.. ఇక సమయం లేదు.. మన ఊరి శాపమిది.. మన పూర్వీకులు ఎంచుకున్న తలరాత..' అంటూ ఊరిని, ఊరి జనాన్నీ పరిచయం చేస్తూ వదిలిన ఈ టీజర్ ఆసక్తికరంగా ఉన్నది. 'శ్రీఆంజనేయం ప్రసన్నాంజనేయం.. శ్రీఆంజనేయం ప్రసన్నాంజనేయం.. ఈ రెండు లైన్లే వస్తున్నాయేంటి?' అంటూ భయపడుతూ వణికిపోతూ సంగీత్ శోభన్ టీజర్‌లో ఎంట్రీ ఇచ్చి అందర్నీ నవ్వించారు. ఆయన ఎంట్రీతో టీజర్ పూర్తిగా కామెడీ జానర్లోకి మారిపోయింది. విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్, నేపథ్య సంగీతం నెక్ట్స్ లెవల్లో ఉన్నాయి. చివర్లో హీరో భయపడుతూ 'ఓస్త్రీ రేపురా..' అనే డైలాగ్ నవ్వుల్ని పూయించింది. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్.

# ప్రతి స్త్రీ గర్వపడేలా సరస్వతి



వరలక్ష్మి శరత్‌కుమార్ నటించి, దర్శకత్వం వహించిన హై-కాన్సెప్ట్ థ్రిల్లర్ 'సరస్వతి'. దోశ డైరీస్ పతాకంపై పూజా శరత్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. టెక్నీషియన్స్ సహకారం, ఆత్మబంధువుల దీవెనల వల్లే ఈ సినిమాను 25రోజుల్లో పూర్తి చేయగలిగానని, ప్రకాష్‌రాజ్, ప్రియమణి తమ పాత్రలకు జీవం పోశారని, సంగీత దర్శకుడు తమన్‌తోపాటు, ఈ సినిమాకు పనిచేసిన ప్రతి టెక్నీషియన్ ప్రాణం పెట్టారని, స్త్రీలందరూ గర్వపడేలా, ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసేలా 'సరస్వతి' ఉంటుందని వరలక్ష్మీ శరత్‌కుమార్ చెప్పారు. 'సరస్వతి' లాంటి కథను కచ్చితంగా చెప్పాలన్నారు సీనియర్ నటుడు శరత్‌కుమార్. ధైర్యాన్నిచ్చే సినిమా 'సరస్వతి' అని, వరలక్ష్మిని చూసి ఒక స్త్రీగా గర్విస్తున్నానని రాధిక శరత్‌కుమార్ అన్నారు. మనసులో ముద్రించుకుపోయిన కథ ఇదని ప్రియమణి ఆనందం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత పూజా శరత్‌కుమార్, నికోలాయ్ సచ్‌దేవ్, ఈటీవీ విన్ ప్రతినిధి నితిన్ చక్రవర్తి, నటి సిమ్రాన్, డైరెక్టర్ నందినీరెడ్డి, సప్తగిరి కూడా మాట్లాడారు.

## 'విశ్వనాథ్ అండ్ సన్స్'గా

# సూర్య 46వ చిత్రం..

### - ఫస్ట్ లుక్‌తోనే అంచనాలు పెంచిన వెంకీ అట్లూరి



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా, 'లక్కీ భాస్కర్' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్‌ను చిత్ర యూనిట్ అధికారికంగా విడుదల చేసింది. సూర్య కెరీర్‌లో 46వ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి ఓ చిన్నారిని ఎత్తుకుని కనిపిస్తున్నారు. సింపుల్ కానీ ఎమోషనల్ టచ్‌తో ఉన్న ఈ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సూర్యలో కనిపిస్తున్న పరిపక్వత, బాధ్యతాయుతమైన తండ్రి పాత్ర ఛాయలు పోస్టర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ చిత్రంలో 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. కీలక పాత్రల్లో రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, భవాని స్రే, బిజోర్న్ సర్‌రావు కనిపించనున్నారు. విభిన్నమైన భావోద్వేగాలు, కుటుంబ నేపథ్యంతో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ కలగలిపిన కథగా ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి సంగీతాన్ని జీవీ ప్రకాశ్ కుమార్ అందిస్తున్నారు. ఇప్పటికే మ్యూజిక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ విలువలు భారీ స్థాయిలో ఉండనున్నాయని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రాన్ని జూలైలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

సూర్య -- వెంకీ అట్లూరి కాంబినేషన్ కావడంతో ఈ సినిమాపై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫస్ట్ లుక్‌తోనే ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం రానున్న రోజులలో మరిన్ని అప్డేట్స్‌తో ప్రేక్షకులకి ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించనుంది.

# మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్

జియో హాట్‌స్టార్ రూపొందిస్తున్న కొత్త రియాలిటీ షో 'మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్'. ప్రస్తుతం ఈ షో చిత్రీకరణ దశలో ఉన్నది. ఈ షోకు చెందిన ఎక్స్‌క్లూజివ్ చిత్రాలు రీసెంట్‌గా బయటకు వచ్చాయి. విశాలమైన మాన్షన్‌లో 10మంది సెలబ్రిటీలు 70రోజుల ప్రయాణానికి సిద్ధమయ్యారు. ప్రేమ, నమ్మకం, సహనం.. ఈ మూడింటి భాగస్వామ్యాన్ని 24/7 కెమెరాల పర్యవేక్షణలో పరీక్షించే విధంగా ఈ లవ్ మ్యాన్షన్‌ని డిజైన్ చేశారు. బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా నిరంతరం కెమెరాల నడుమ రూపొందుతున్న ఈ రియాలిటీ షో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిందని మేకర్స్ చెబుతున్నారు. అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి, సీనియర్ హీరోయిన్ రాధ, లయ ఈ షోకి జ్యూరీగా ఉండటం విశేషం. శ్రీముఖి ఈ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నది.




# హృతిక్ హీరోగా సౌత్ సినిమా?



గత ఏడాది 'వార్ 2'తో పానిండియా ఆడియన్స్‌ని పలకరించిన హృతిక్ రోషన్.. తర్వాతి ప్రాజెక్ట్‌గా స్వీయ దర్శకత్వంలో 'క్రిష్ 4' చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్‌కి వెళ్తుందా అని ఎదురు చూసిన హృతిక్ అభిమానులకు ఇప్పుడు నిరాశే మిగిలింది. కారణం.. హృతిక్ ప్రస్తుతానికి 'క్రిష్ 4'ను పక్కనపెట్టారట. దానికంటే ముందు మరో ప్రాజెక్ట్‌ని పూర్తి చేయాలని ఆయన నిశ్చయించారట. ఆ వివరాల్లోకెళ్తే. కన్నడ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్‌తో ఓ క్రేజీ ప్రాజెక్ట్ చేసేందుకు హృతిక్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది హృతిక్ చేయనున్న తొలి సౌతిండియా సినిమా కావడం విశేషం. ఈ సినిమా పూర్తి చేసిన తర్వాతే 'క్రిష్ 4'ని పట్టాలెక్కించాలని హృతిక్ భావిస్తున్నారట. ఇక హోంబలే వారితో హృతిక్ చేయబోయే ప్రాజెక్ట్‌కి సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.


# పెద్ది డబ్బింగ్ మొదలు



అగ్రహీరో రామ్‌చరణ్ నటిస్తున్న పానిండియా మాస్ ఎంటర్‌టైనర్ 'పెద్ది' సినిమా ఏప్రిల్ 30న విడుదల కానున్న విషయం తెలిసిందే. బుచ్చిబాబు సానా ప్రస్టేజియస్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఇప్పటికే దేశవ్యాప్తంగా నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఏ.ఆర్.రెహ్మాన్ స్వరపరిచిన 'చికిరి' సాంగ్ అయితే.. ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయింది. ఇదిలావుంటే.. తాజాగా హీరో రామ్‌చరణ్ 'పెద్ది' డబ్బింగ్‌ను ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ తన ఇన్‌స్టాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు రామ్‌చరణ్. ఒక్క తెలుగులోనే కాక, అన్ని భాషల్లోనూ తానే డబ్బింగ్ చెప్పబోతున్నట్టు ఈ వీడియోలో పేర్కొన్నారాయన. అంతేకాకుండా.. 'చికిరి' పాటపై దర్శకుడు బుచ్చిబాబుతో జరిపిన తన సంభాషణ కూడా ఫ్యాన్స్‌కు మంచి కిక్‌ని ఇస్తున్నది. అలాగే.. ఈ వీడియోలో 'ఏమది' అంటూ సినిమాలోని ఓ చిన్న డైలాగ్‌ని కూడా రామ్‌చరణ్ చెప్పడం జరిగింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. సోమవారం ఈ సినిమా నుంచి రెండో పాట 'రై రై రారా' కూడా విడుదల కానున్న విషయం తెలిసిందే. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జగపతిబాబు, దివేందుశర్మ, బోమన్ ఇరానీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేలు, నిర్మాత: వెంకటసతీష్ కిలారు, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

# యుద్ధం కారణంగా వివిధ దేశాల్లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజలకు ఏపీ ప్రభుత్వ సహాయం

**ఏపీ ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్‌కు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**
**కేంద్రంతో సమన్వయం చేసుకుని, పౌరులు సురక్షితంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశం**



అమరావతి(ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న రాష్ట్ర ప్రజలు సురక్షితంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై ఆర్టీజీఎస్ అధికారులు, ఏపీఎన్ఆర్టీ ప్రతినిధులతో క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ తదితర దేశాల్లోని రాష్ట్ర ప్రజలు యుద్ధం కారణంగా ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఇందుకోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అక్కడ చిక్కుకుపోయిన వారిని సంప్రదించి, తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. సహాయక చర్యల విషయంలో ఏపీ ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్ కలిసి పనిచేయాలని, నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులకు సీఎం చెప్పారు. కేంద్రం ద్వారా ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి, అందరూ సురక్షితంగా ఉండేలా చూడాలని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన రాష్ట్ర ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఎయిర్ పోర్టులు మూసివేయడం, విమాన సర్వీసుల రద్దుతో వెంటనే రాష్ట్రానికి తిరిగి వచ్చే పరిస్థితులు లేనందున, పరిస్థితులు చక్కబడేవరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, దీనికి ఏపీ ఎన్ఆర్టీ సహకరిస్తుందని సీఎం చెప్పారు.

### హెల్ప్ లైన్ నెంబర్ 0863-2340678

గల్ఫ్ దేశాల్లో రాష్ట్ర ప్రజల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఎన్ఆర్టీతో కలిసి చర్యలు చేపట్టింది. వారికి సహాయం కోసం 0863-2340678 హెల్ప్ లైన్ నెంబర్, 85000 27678 వాట్సప్ నెంబర్‌ను 24 గంటలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏపీ ఎన్ఆర్టీ కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి కల్పిస్తున్నారు. ప్రవాసాంధ్రులు సంప్రదించిన వెంటనే ఏపీ ఎన్నార్టీ వారికి తక్షణం సహాయ, సహకారాలు అందించేలా ఏర్పాట్లు చేసింది. హెల్ప్ లైన్ నెంబర్లతో పాటు helpline@apnrts.com, support@apnrts.com, info@apnrts.com ఈ మెయిళ్లు, https://apnrts.ap.gov.in వెబ్సైట్‌ను కూడా సంప్రదించవచ్చు. ఈ సమీక్షలో ఆర్టీజీఎస్ అధికారులు, ఎన్ఆర్టీ ప్రతినిధులు పాల్గొన్నారు

## ఐడీఓసీలో అధికారికంగా శ్రీపాదరావు జయంతి



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్ గా శ్రీపాదరావు అందించిన సేవలను స్మరిస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు కలెక్టర్(ఎల్ బి), మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, డి ఆర్ డి ఓ సాయ గౌడ్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పవన్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క ఎస్.ఐ , సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని , పరిష్కారానికి సూచనలు చేశారు ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.వివిధ ఫిర్యాదు లకు సంబందించిన 34 ఫిర్యాదు లను స్వీకరించారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణికి అధికారులందరూ హాజరు కావాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఇంచార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దిలీప్ కుమార్ తో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 83 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. అయితే ప్రజావాణి కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజర్ అయ్యారు. దీనిని గమనించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రజావాణి వినతుల స్వీకరణ పూర్తయిన అనంతరం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గైర్హాజర్ అయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ

**అమ్మవారి అలంకరణలో ఒకటవ తరగతి విద్యార్థిని చైత్ర**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) సాధారణంగా ఎడ్యుకేషన్ ఫెయిర్ అంటే కేవలం ప్రయోగాలు, చార్టులు మాత్రమే ఉంటాయని అనుకుంటాం. కానీ ఎస్.ఎస్.జీ హైస్కూల్ యాజమాన్యం మరియు విద్యార్థులు ఒక అడుగు ముందుకు వేసి, మన సంస్కృతిని ప్రతిబింబించేలా పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న గడ్డం చైత్రను పాఠశాల ఉపాధ్యాయుల విన్నపం మేరకు విద్యార్థిని తల్లిదండ్రులు దుర్గామాత అమ్మవారిగా అద్భుతంగా అలంకరించి పాఠశాలకు పంపించారు. అమ్మాయికి వేసిన అమ్మవారి అలంకరణ ప్రదర్శనకే ఒక కొత్త కళను సంతరించుకుంది. రంగురంగుల స్వచ్ఛమైన పుష్పాలతో, విద్యార్థులు స్వయంగా వేసిన ముగ్గులతో అమ్మవారి పీఠాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ప్రదర్శన చూడటానికి వచ్చిన తల్లిదండ్రులు, అతిథులు ముందుగా అమ్మవారిని దర్శించుకుని, ఆశీస్సులు తీసుకుకోవడం విశేషం. ఇది విద్యాలయానికి ఒక దేవాలయ కళను తెచ్చిపెట్టింది. పిల్లలు చేసిన సైన్స్ ప్రాజెక్టులు ఒక ఎత్తు అయితే అమ్మవారి అలంకారం మాకు ఎంతో ప్రశాంతతను ఇచ్చింది. అమ్మవారి ఆశీస్సులు పిల్లలపై ఎప్పుడూ ఉండాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుకున్నారు.

# బోయిన్ పల్లి మార్కెట్ లో "ఎమ్మెల్యే శ్రీ గణేష్ రివ్యూ"

- పాలకమండలితో భేటీ అయిన స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్
- మార్కెట్లో మౌళిక సమస్యల పై ఆరా, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై చర్చ
- అడగంది అమ్మైన అన్నం పెట్టదు, ఒక్కసారి అడిగి వదిలేస్తే ఎలా అంటూ ప్రశ్న.?
- ఆర్థిక శాఖలో విడుదల కాని నిధులపై ప్రధానంగా చర్చించిన ఎమ్మెల్యే



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ పై వరుస కథనాలు "ప్రజా ప్రశ్న న్యూస్" టైం లో రావడంతో ఆకస్మికంగా బోయిన్ పల్లి మార్కెట్ ని సందర్శించారు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న సోమవారం ఉదయం బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ పాలకమండలి, అధికారులతో సమీక్ష, సమావేశం నిర్వహించారు. బోయిన్ పల్లి మార్కెట్ అభివృద్ధి, మార్కెట్ కు వచ్చే రైతులకు, హామాలీలకు సౌకర్యాలు, మార్కెట్ కు ఆదాయ వనరులను పెంచడం, మార్కెట్ లో పరిశు భ్రత,యార్డులో మౌలిక వసతులపై మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గం, అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మార్కట్లో నెలకొన్న మౌళిక సమస్యల పై కమిటీ చైర్మన్, సెక్రటరీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ముఖ్యంగా చర్చలో వచ్చిన అంశాలు వే బ్రిడ్జి నిర్మాణం,"39" లైసెన్స్ దారులకు చెందిన షాపులు అసంపూర్తిగా ఉన్న షాపుల నిర్మాణం,టాయిలెట్లు, రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమీక్షలో అధికారులకు తగిన సూచనలు చేసి,ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ అయిన బోయిన్ పల్లి మార్కెట్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంతో పాటు మార్కెట్ కు ఆదాయం కూడా పెరగడానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, సెక్రటరీ ఈ.వెంకటేష్, గ్రేడ్ వన్ అధికారి మధురిక, యార్డ్ ఇంచార్జ్ గ్రేడ్ టూ అధికారి జె.సత్యనారాయణ, గ్రేడ్ త్రీ మహ్మద్ కాజా, రఫీక్, అశోక్, మధు, కమిటీ సభ్యులు శరత్, ప్రభాకర్, సంతోష్ కుమార్, అస్లాం, రామ్, సంతూ జూలియస్ తదితరులు పాల్గొన్నారు.

### - బోయిన్ పల్లి మార్కెట్లో టెండర్

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో సగటున రోజుకు ఇరవై ఐదు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. కానీ ఆశ్చర్యపడాల్సిన విషయం ఏమిటంటే కేవలం ఒక్కటంటే ఒక్కటే టాయిలెట్లు ఉన్నాయి. ఇవి కేవలం పదుల సంఖ్యలో వారికే సరిపడా మరుగు దొడ్లు ఉండడంతో రైతులు, భారీ వాహనాల దారులు,ఖరీదు దారులు, కమీషన్ ఏజెంట్లు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, సెక్రటరీ నిన్న సోమవారం మధ్యాహ్నం"టెండర్లు" ఆహ్వానించారు. మార్కెట్ అధికారులు విక్రయించిన దరఖాస్తులు ఆరు. ఆరుకు ఆరుగురు టెండర్లలో పాల్గొన్నారు. అయితే వీరిలో ఒకరు అంకెల పొరపొచ్చాలు ఉండడంతో టెండర్లో నుంచి వైదొలిగారు. మిగిత వారిలో అత్యధికంగా కోడ్ చేసిన వారు 1).రవింధర్ గుహాట్ రెండు లక్షల ఐదు వేల యాభై ఒక్క రూపాయి. 2). క్లిన్ అండ్ గ్రీన్ సంజయ్ జా:రెండు లక్షల పదకొండు వేల నూట డెబ్బై ఒక్క రూపాయి. 3).ఏ కే ఇంట్రైప్రైజస్ కే.అమిత్ కుమార్.లక్ష నలభై ఒక్క వెయ్యి రూపాయలు. వీరిలో అత్యధికంగా కోడ్ చేసిన వ్యక్తి రవింధర్ గుహాట్ కే టెండర్ సొంతం చేసుకున్నారని, అలాగే గతంలో రంజీత్ మిశ్ర అనే వ్యక్తి లక్ష ఎనభై ఐదు వేల రూపాయలకు సొంతం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు మార్కెట్ కమిటీ అధికారులు. అలాగే మార్కెట్ సెక్రటరీ ఈ.వేంకటేశం మాట్లాడుతూ త్వరలో బోయిన్ పల్లి మార్కెట్లో నాలుగు టాయిలెట్లు నిర్మాణం జరగబోతోందన్నారు. (బివోటి) బ్లిల్ట్ ఆపరేట్ అండ్ ట్రాన్స్ఫర్ (నిర్మాణ నిర్వహ బదిలీ) విధానంతో మార్కెట్ యార్డ్ లో ముసపేట్ లైన్లో ఒకటి, ఎల్ఐసి గొడను ఆనుకుని మరో మూడు నిర్మాణం చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

# నూతన్ కల్ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి

**కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్**
**ధోబి ఘాట్, వైకుంఠధామలకు మంచినీటి సరఫరా పునరుద్ధరణ**
**కౌన్సిలర్ల పనితీరుపై గ్రామస్తుల ప్రశంసల జల్లులు**







మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని నూతన్ కల్ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్ అన్నారు. అదేవిధంగా గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు పురపాలక సంఘం చైర్మన్ శ్రీదేవి సహకారంతో ముందుకెళ్తామన్నారు. సోమవారం గ్రామంలోని వైకుంఠధామం, ధోబి ఘాట్ లకు చైర్ పర్సన్ శ్రీదేవి సహకారంతో మంచినీటి సరఫరా చేసి సమస్యను పరిష్కరించినట్లుగా తెలియజేశారు. కాగా గత కొంతకాలంగా గ్రామంలో ఉన్న దోబీ ఘాట్, వైకుంఠధామాలకు నీటి సరఫరా లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చేసేదేం లేక ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించుకొని అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు తెలియజేశారు. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్ లు మంచినీటి సరఫరా చేసి సమస్యను పరిష్కరించి దోబీ ఘాట్, స్థానాల గదులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు స్థానిక వార్డు కౌన్సిలర్లతో కలిసి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యురాలు రుక్సానా యూనిస్ పాషా, నాయకులు మహేందర్ రెడ్డి, సుదర్శన్, అనీఫ్, భూషణం, దాస్, సురేష్ చారి, వీరస్వామి, రాజేందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### దోబీ ఘాటుకు నీటి సరఫరా చేసిన పురపాలక సంఘం చైర్మన్, కౌన్సిలర్లకు ధన్యవాదాలు : చామంతుల శివ

నూతనకల్ గ్రామంలోని ధోబిఘాట్ కు నీటి సరఫరా లేక ఏదైనా శుభకార్యం కానీ, అశుభకార్యం జరిగితే బట్టలు ఉతకడానికి చాలా ఇబ్బందిగా ఉంది. దోబీఘాటుకు నీటి సరఫరాకు కృషిచేసిన పురపాలక సంఘం చైర్మన్ శ్రీదేవి, కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్, గ్రామ నాయకులకు ధన్యవాదాలు. వైకుంఠధామానికి నీటి సరఫరా చేసిన పురపాలక సంఘం చైర్మన్, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు : మంగలి నవీన్ నూతనకల్ గ్రామంలో ఎవరైనా చనిపోయినట్లయితే స్నానాలు చేయాలంటే స్థాన గదులలో నీరురాక ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించుకొని బయటే స్థానాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బహిరంగ ప్రదేశంలో ట్యాంకర్ల కిందే మహిళలు స్థానాలు చేసుకోవడానికి మరి ఇబ్బందిగా ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్, పురపాలక సంఘం చైర్మన్ శ్రీదేవిలకు గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు.

# సాకేత్ ప్రణామం అసోసియేషన్ డైరెక్టర్ల ఎన్నిక



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సాకేత్ ప్రణామం అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ నూతన డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. అసోసియేషన్‌లో ఖాళీగా ఉన్న మూడు డైరెక్టర్ల స్థానాలకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కేతినేడి రామ్మోహనరావు, వల్లూరి వరప్రసాదరావు, వాత్సవాయి రామకృష్ణలు డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రభులింగం అధికారికంగా ప్రకటించారు. డైరెక్టర్ల ఎన్నిక అనంతరం జరిగిన సమావేశంలో అసోసియేషన్ చైర్మన్‌గా కేతినేడి రామ్మోహనరావు పేరును ఖరారు చేశారు. సాకేత్ వెల్‌నెస్ హబ్‌లో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం అపార్ట్‌మెంట్స్ సంక్షేమం కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యం ఎందుకు.?

## -హాస్టల్ నిర్మాణం తక్షణమే చేపట్టాలి

- అక్రమార్కులతో అధికారులు కుమ్మక్కయ్యారా.? అనే అనుమానాలు
-647 సర్వేనెంబర్ కు చెందిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భూమిని పరిరక్షించాలి
- శిశు సంక్షేమం ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టాలి
-అధికారులు అవకతవకలకు తావిస్తే సహించేది లేదంటూ హెచ్చరికలు
-లోకాయుక్తలో ఫిర్యాదు చేసేందుకు ఏకమవుతున్న స్థానికులు






జవహార్ నగర్ (ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి మల్లారెడ్డి ఇలాకా జవహార్ నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం మళ్లీ ఊపందుకుంది, గత తహసిల్దార్ సుచరిత ప్రభుత్వ భూముల పరిరక్షణే ద్యేయంగా కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించి చట్ట విరుద్ధంగా ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడిన అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్షార్హులను చేసి ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలంటే అమ్మో ప్రభుత్వ భూమా అనే అంతటి భయాందోళనకు గురిచేసిన తహసిల్దార్ సుచరిత ఘనత నేడు మళ్లీ అక్రమార్కుల్లో సన్నగిల్లుతోంది, ప్రభుత్వ భూముల కబ్జా వ్యవహారం అధికారుల అండదండలు లేనిదే జరుగుతుందా.? అధికారులే అక్రమార్కులైతే ప్రభుత్వ భూములకు రక్షణ ఎక్కడ ఉంటుంది, అనే విమర్శలు ప్రజల్లో నేడు మళ్లీ అధికమవుతున్నాయి. శిశు సంక్షేమం ఆధ్వర్యంలో శ్రామిక మహిళా వసతి గృహం ( వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ) నిర్మాణం కోసం కేటాయించిన 647 సర్వేనెంబర్ కు చెందిన ఒక ఎకరా 20 గుంటల స్థలం అక్రమార్కుల హస్తగతం కాకుండా పరిరక్షించి తక్షణమే కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు డెంటల్ కాలేజ్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ స్థలం కోట్లు విలువ చేసే స్థలం కావడంతో కొందరు అక్రమార్కులు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు లంచాల రూపంలో లక్షలు వెదజల్లి అధికారులను లోబర్చుకునేందుకు అంతు చిక్కని కుటిలయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి. శిశు సంక్షేమం ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం 647 సర్వేనెంబర్ కు చెందిన ప్రభుత్వ భూమిలో చేపట్టేందుకు 8 కోట్ల నిధులను కూడా కేటాయించడం జరిగిందని ఈ విషయాన్ని బహిర్గతం కాకుండా కొందరు అక్రమార్కులు కోటి కుట్రలు పన్నుతున్నారనే వినికిడి హట్టహాసంగా వినిపిస్తోంది. జవహర్ నగర్ జిహెచ్ఎంసి ప్రాంతంగా అభివృద్ధి చెందిన ఈ సమయంలో శిశు సంక్షేమం ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం కోసం కేటాయించిన 647 సర్వేనెంబర్ కు చెందిన భూమి అక్రమార్కుల హస్తగతం కాకుండా దారి మళ్లించేందుకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా అధికారికంగా కేటాయించిన 8 కోట్ల నిధులతో శిశు సంక్షేమం మహిళా అభ్యున్నతినీ దృష్టిలో పెట్టుకొని హాస్టల్ నిర్మాణం కోసం అధికారులతో పాటు పార్టీలకు అతీతంగా నాయకులు మేధావులు విద్యావంతులు కృషి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు

### అధికారులకు కనుసన్నాల్లోనే ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం కొనసాగుతుందా.?

మహిళల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్న ఈ సమయంలో జవహర్ నగర్ ప్రాంతంలో శిశు సంక్షేమం ఆధ్వర్యంలో శ్రామిక మహిళ వసతి గృహ నిర్మాణం చేపట్టేందుకోసం కేటాయించిన స్థలం కబ్జా వ్యవహారం నేడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ఉన్న అధికార యంత్రాంగం శ్రామిక మహిళవసతి గృహం కోసం అధికారకంగా కేటాయించిన 647 సర్వేనెంబర్ కు చెందిన ప్రభుత్వ భూమిని పరిరక్షించలేని నిస్సహాయ స్థితిలో ఉన్న అధికారుల తీరు ఎన్నో రకాల అనుమానాలకు తావిస్తోంది. అక్రమార్కులతో అధికారులు కుమ్మక్కై ఏమైనా లోపాయికార ఒప్పందాలకు లోనై అక్రమ సంపాదనకు ఆసక్తి చూపుతూ ఈ శ్రామిక మహిళా వసతి గృహం స్థలం అక్రమార్కుల హస్తగతమయ్యే విధంగా తెరచాటుగా ఉచిత సలహాలు ఇస్తూ విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారా.? అనే అనుమానాలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి. అధికారులు ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా బాధ్యతయుతంగా విధులు నిర్వహించిన యెడల శ్రామిక మహిళ వసతి గృహ నిర్మాణం పనులకు ఆటంకం కలిగిస్తూ పెట్రేగిపోతున్న అక్రమార్కుల ఆగడాలకు ముక్కుతాడు వేసి అక్రమార్కులను శిక్షార్హులను చేయకుండా గాఢ నిద్రలో మునిగి తేలుతున్నట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరు అధికారులు ప్రభుత్వం ఇచ్చే జీతాలకన్నా అక్రమార్కులు అక్రమ మార్గంలో అందజేసే ముడుపులకు ముచ్చట పడుతున్నారు అనడానికి నిలువెత్తు నిదర్శనం కాదా.? అని స్థానికులు మండిపడుతున్నారు

### అధికారులు అక్రమార్కులైతే సమాచారం ఇచ్చే ప్రతి పౌరునికి ప్రాణహాని..

న్యాయ రక్షణలో దేశ పౌరులందరూ భాగస్వాములు కావాలని ప్రతి పౌరుని పరిసర ప్రాంతంలో జరిగే అక్రమాలను తమ దృష్టికి తీసుకురావాలని సమాచారం అందించిన వారి ఫోన్ నెంబర్లను గోపియంగా ఉంచి అక్రమాలకు పాల్పడిన అక్రమార్కుల ఆటకట్టిస్తామంటూ దేశ పౌరులందరిని ఉత్తేజ పరుస్తున్న ఈ సమయంలో స్థానికంగా నెలకొన్న అక్రమాలను బహిర్గత పరుస్తూ వార్తా ప్రకటనల ద్వారా అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ చీమ కుట్టినంత చలనం లేకుండా ససేమిరా అన్నట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటి.? చట్టం మా చుట్టమే అనే అమాయకత్వమా.? అధికారం చేతిలో ఉందనే అహంభావమా.? దొరికినప్పుడే దోచుకోవాలి అనే ఆశ తత్వమా.? అనే విమర్శలు దినదినం అధికమవుతున్నాయి ఎలాంటి విమర్శలకు అపోహాలకు అనుమానాలకు అధికారులు తావివ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే ఈ ప్రభుత్వ భూముల కబ్జాల పరంపర ఏలా కొనసాగుతుందని నిలదీస్తున్నారు ఈ కబ్జా వ్యవహారాన్ని అధికారులకు చేరవేస్తున్న విషయాన్ని అక్రమార్కులు దృష్టిలో పెట్టుకొని ప్రాణహానేతర ప్రమాదకర సంఘటనలు చోటుచేసుకున్నా ఎడల విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడే అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

### స్టే తీసుకువచ్చి భూమిని ఇరుకాటంలో పెట్టేందుకు అక్రమార్కుల యత్నాలు

సులువైన సంపాదన కోసం అలవాటు పడిన అక్రమార్కులు కోట్ల విలువ చేసే ఈ విలువైన స్థలంపై కన్ను వేసి ఏ విధంగానైనా ఈ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయించి కోట్లు దండుకోవడమే ఏకైక లక్ష్యంగా రాష్ట్రస్థాయి నాయకుల పైరవీలతోపాటు చట్టపరంగా స్టే తీసుకువచ్చి మహిళా వసతి గృహ నిర్మాణానికి ఆటంకం కలిగించే విధంగా అక్రమార్కుడు కుటిల యత్నాలు చేస్తున్నారని వీటన్నిటికీ అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరే కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు త్వరగా శిశు సంక్షేమం ఆధ్వర్యంలో శ్రామిక మహిళ వసతి గృహ నిర్మాణం పనులను త్వరితగతిన ప్రారంభించి జవహర్ నగర్ మహిళ సంక్షేమం కోసం కృషి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనియెడల ఈ విషయాన్ని లోకాయుక్త దృష్టికి తీసుకువెళ్లి నెగ్గ తేల్చేంతవరకు ఉద్యమ స్పూర్తితో ముందుకు సాగుతామని హెచ్చరిస్తున్నారు

# టీ20 ప్రపంచకప్‌లో కెనడా ఆడడం సంతోషం కలిగించింది

**- భారత్-కెనడా సీఈవోల ఫోరమ్ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ సోమవారం న్యూఢిల్లీలో జరిగిన 'ఇండియా-కెనడా సీఈవోల ఫోరమ్'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఇరు దేశాల సంబంధాలను క్రికెట్‌తో పోల్చుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2023లో ఖలిస్తానీ వేర్పాటువాద కార్యకలాపాల కారణంగా దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకునే దిశగా ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ "మీలో చాలామంది క్రికెట్‌ను గమనిస్తూనే ఉంటారు. భారత్ వేదికగా జరుగుతున్న టీ20 వరల్డ్ కప్‌లో కెనడా జట్టు ఆడటం మనందరికీ ఎంతో సంతోషాన్నిచ్చింది. టీ20 క్రికెట్‌లో వేగవంతమైన నిర్ణయాలు, భయంలేని స్ట్రోక్స్, మ్యాచ్ విన్నింగ్ పార్ట్‌నర్‌షిప్‌లు ఎలా ఉంటాయో.. అలాగే భారత్, కెనడా కూడా కలిసి భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటాయి" అని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భారత్ అభివృద్ధి ప్రయాణంలో భాగం కావాలని ఆయన పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. మరోవైపు, భారత్‌లో జరిగిన 2026 ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్‌లో కెనడా ప్రదర్శన అంతంతమాత్రంగానే సాగింది. గ్రూప్-డిలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్, యూఏఈ వంటి జట్లతో పోటీపడిన కెనడా.. ఆడిన నాలుగు మ్యాచ్‌లలోనూ ఓటమిపాలై గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో చివరి ఓవర్ వరకు పోరాడినా 5 వికెట్ల తేడాతో ఓడిపోయింది. బ్యాటింగ్‌లో అప్పుడప్పుడు మెరుపులు మెరిపించినా, నిలకడలేమి కారణంగా సూపర్-8 రేసులోకి రాలేకపోయింది.

# ఏఐ సృష్టించిన నకిలీ తీర్పులు

**- ట్రయల్ కోర్టులపై సుప్రీంకోర్టు ఆగ్రహం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఉనికిలో లేని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సృష్టించిన నకిలీ తీర్పులను ప్రామాణికంగా తీసుకుని ఒక సివిల్ కేసులో ట్రయల్ కోర్టు వ్యవహరించిన తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కేవలం నిర్ణయం తీసుకోవడంలో జరిగిన పొరపాటు కాదని, న్యాయమూర్తుల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థ విశ్వసనీయతకే భంగం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలోని ఓ ఆస్తి తగాదా కేసులో ఈ విషయం వెలుగుచూసింది. అడ్వకేట్ కమిషనర్ నివేదికపై ప్రతివాదుల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ ట్రయల్ కోర్టు కొన్ని సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించింది. అయితే, ఆ తీర్పులు అసలు లేనే లేవని, అవి ఏఐ సృష్టించిన నకిలీవని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఏపీ హైకోర్టు కూడా అవి నకిలీ తీర్పులేనని గుర్తించి హెచ్చరించినప్పటికీ, కేసు మెరిట్స్ ఆధారంగా పిటిషన్‌ను కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం.. ఏఐ సృష్టించిన నకిలీ తీర్పుల ఆధారంగా న్యాయస్థానాలు నడుచుకోవడం సంస్థాగతంగా ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది. దీనికి చట్టపరమైన పర్యవసానాలు ఉంటాయని హెచ్చరించింది. ఈ వ్యవహారంపై అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ చేసింది. కోర్టుకు సహాయం చేసేందుకు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్‌ను అమికస్ క్యూరీగా నియమించింది. తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేస్తూ, అప్పటివరకు అడ్వకేట్ కమిషనర్ నివేదిక ఆధారంగా ముందుకెళ్లవద్దని ట్రయల్ కోర్టును ఆదేశించింది.

# అక్రమ నిర్మాణాలకు 'రాజకీయ' రక్షణ కవచం

**ఓటు బ్యాంకు రాజకీయం - కబ్జాలకు ఊతం**
**అధికారులపై కౌన్సిలర్ల ఒత్తిడి**
**భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం**
**మృత్యుపాశాలుగా మారుతున్న అక్రమ నిర్మాణాలు**
**రాజకీయ జోక్యం పూర్తిగా నశించాలి**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఎల్లంపేట పురపాలక సంఘం పరిధి శరవేగంగా విస్తరిస్తున్న కొద్దీ అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి అనుమతులు లేకుండా వెలుస్తున్న ఈ భవనాల వెనుక నూతనంగా బాధ్యతలు చేపట్టిన కౌన్సిలర్లు, రాజకీయ శక్తుల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణ పౌరుడు చిన్న ఇల్లు కట్టుకోవాలంటే పురపాలక సంఘం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంటే, కొందరు మాత్రం రాత్రికి రాత్రే అంతస్తుల మీద అంతస్తులు లేపేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం స్థానిక నేతల 'అండ'.



### అధికారులపై ఒత్తిడి..

నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడానికి వెళ్లే అధికారులకు నేరుగా ప్రజాప్రతినిధుల నుంచే ఫోన్ కాల్స్ వెళు తున్నాయి. "మా వాడే సార్.. చూసి చూడనట్లు వదిలేయండి" అనే ఒక్క మాటతో అక్రమ కట్టడాలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తుంది. మాట వినని అధికారులను లూప్ లైన్ పోస్టింగ్‌లకు బదిలీ చేయించడం లేదా వేధింపులకు గురి చేయడం వంటివి సర్వసాధారణమైపోయాయనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.






### భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం..

అక్రమ నిర్మాణాల వెనుక భారీగా చేతులు మారుతున్న సొమ్ము మరో ప్రధాన కారణం. బిల్డర్ల నుంచి రాజకీయ నేతలకు, వారి అనుచరులకు భారీగా మామూళ్లు అందుతుంటాయి. ఈ అవినీతి చక్రంలో కొందరు అధికారులు కూడా భాగస్వాములవ్వడంతో సామాన్యుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. పార్కింగ్ స్థలాలు లేకపోవడం, అగ్నిమాపక నిబంధనలు పాటించకపోవడం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.

### మృత్యుపాశాలుగా మారుతున్న అక్రమ నిర్మాణాలు..

రాజకీయ స్వార్థం కోసం అనుమతిస్తున్న ఈ అక్రమ నిర్మాణాల వల్ల ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో మురుగునీటి పారుదల వ్యవస్థ దెబ్బతింటోంది. వర్షం వస్తే రోడ్లన్నీ జలమయం అవ్వడానికి ప్రధాన కారణం నాలాల ఆక్రమణలే. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఈ భవనాలే మృత్యుపాశాలుగా మారుతున్నాయి.



### ఓటు బ్యాంకు రాజకీయం - కబ్జాలకు ఊతం..

చాలా సందర్భాల్లో ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు, నాలాలను ఆక్రమించి ఇళ్లు కట్టుకునే వారికి స్థానిక నేతలు అభయం ఇస్తుంటారు. వీరంతా తమకు శాశ్వత ఓటు బ్యాంకుగా మారుతారనే ఆశతో, అధికారులు చర్యలు తీసుకోకుండా రాజకీయ ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ ప్రాంతాలే గెలుపోటములను నిర్ణయించే కీలక శక్తిగా మారుతున్నాయి.

### రాజకీయ జోక్యం పూర్తిగా నశించాలి..

అక్రమ నిర్మాణాలను అరికట్టాలంటే రాజకీయ జోక్యం పూర్తిగా నశించాలి. చట్టం అందరికీ సమానంగా వర్తించినప్పుడే ప్రణాళికాబద్ధమైన పురపాలక సంఘముగా నిర్మాణం సాధ్యమవుతుంది. కేవలం ఓట్ల కోసం, నోట్ల కోసం భవిష్యత్తు తరాల భద్రతను పణంగా పెట్టడం అన్యాయం. అధికారులు భయం లేకుండా పనిచేసే వాతావరణం కల్పించినప్పుడే ఈ 'అక్రమ' దందాలకు, నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుంది.

# ఏసీబీ అధికారులకు దొరికిన జూనియర్ అసిస్టెంట్ గణేష్

కుత్బుల్లాపూర్ (ప్రశ్న న్యూస్) ఫ్యామిలీ మెంబెర్స్ సర్టిఫికెట్ కోసం ఇరవై వేలు లంచం అడిగిన ఎమ్మార్వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న గణేష్ గ్రామపాలన ఇచార్జి అధికారిగా కూడా ఉన్నారు. ఇటీవల ఒక కుటుంబం ఫ్యామిలీ మెంబెర్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు. చేసుకోగా వాళ్ళని సంప్రదించిన గణేశన్ ఇరవై వేలు లంచం ఇస్తే ఎమ్మార్వో తో మాట్లాడి సర్టిఫికెట్ ఇప్పిస్తానని ప్రతిపాదించాడు. దీంతో వాళ్ళు ఏసీబీని ఆశ్రయించి గణేష్ ను పట్టించారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588